

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 18 సెప్టెంబరు 2025


ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని వింటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

జీవీఎంసీ విస్తరణ?

ముఖ్యమంత్రి వద్ద కొందరు ఎమ్మెల్యేల ప్రతిపాదన


ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- జిల్లా మొత్తాన్ని నగర పాలక సంస్థ పరిధిలోకి తీసుకురావాలనే అంశంపై చర్చ
- జిల్లాలో ఎస్.కోట విలీనం అంశంపై కూడా...
- నగరంలో ప్రజారోగ్యం, వీధి లైట్లు, తాగునీరు, రోడ్ల నిర్వహణపై సీఎం ఆరా
- రోజువారీ పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్‌కు సూచన
- విశాఖ విమల విద్యాలయం సమస్య, పోలీస్ కమిషనరేట్‌లో ఖాళీల భర్తీ గురించి ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లా


'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమానికి హాజరైనవారు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): **గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిని విస్తరించాలని నగర ఎమ్మెల్యేలు కొందరు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు ప్రతిపాదించారు. ఇదే సందర్భంగా కేవలం 11 మండలాలతో ఉన్న జిల్లాను విస్తరిస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా చర్చ సాగింది.**

నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎంను తొలుత బస్సులో జిల్లా ఎమ్మెల్యేలు కలిశారు. కేవలం నాలుగు గ్రామీణ మండలాల (పెందుర్తి, భీమునిపట్నం సగం సగం, ఆనందపురం, పద్మనాభం పూర్తిగా) కోసం జడ్పీ, జిల్లా పంచాయతీ, ఇలా పలు గ్రామీణ సంబంధిత కార్యాలయాలు ... మిగతా 6వ పేజీలో


'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ప్రారంభం సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన చిన్నారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

మహిళా భద్రతలో విశాఖ టాప్

- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు జీఎంఆర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుసంధానం
- ఆగస్టులో భోగాపురం విమానాశ్రయంలో ఆపరేషన్స్
- సీఎం నారా చంద్రబాబునాయుడు
- వచ్చే నెలలో గూగుల్..
- డేటా సెంటర్ ఏర్పాటుకు రెడీ

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భద్రత కల్పించే నగరంగా విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఒక రోజు పర్యటనకు బుధవారం నగరానికి వచ్చిన ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అబియాన్' ప్రారంభ కార్యక్రమంలో, ఆ తరువాత రాడీసన్ బ్లూ హోటల్‌లో సీఐఐ నిర్వహించిన జీసీసీ ... మిగతా 6వ పేజీలో

క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి

- ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించాలి
- మహిళలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి పరీక్షలు చేయించుకోవాలి
- సికిల్‌సెల్ ఎనీమియా పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): **క్యాన్సర్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, వ్యాధి పట్ల నెలకొన్న భయాలు, ఆందోళనలను తొలగించాలని వైద్యులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. బుధవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సాగరిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన వైద్య పరీక్షల స్టాల్స్‌ను ఆయన సందర్శించారు.**

ఈ సందర్భంగా పలువురు రోగులు, వైద్యులతో మాట్లాడిన ఆయన...మహిళలు ముందుకువచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ పట్ల ఇప్పటికీ అనేక అనుమానాలు, అపోహలు ఉన్నాయని, గతంలో పారిశ్రామికవేత్తలు దీని బారినపడి బయటకు చెప్పుకునేందుకు ఇబ్బంది పడ్డారన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా పట్ల కూడా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పెళ్లికి ముహూర్తాలతోపాటు ఎనీమియా సమస్య ఉందా?, లేదా?...అన్నది నిర్ధారించుకోవాలని సూచించారు. మేనరికపు వివాహాల వల్ల ఈ తరహా సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఒక స్టాల్‌లో చిన్నారికి వ్యాక్సిన్ వేయడం ద్వారా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. అలాగే ఎన్‌సీడీ 4.0 హౌస్ హోల్డ్ సర్వే, స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఆరోగ్య డేటా ఆన్‌లైన్ చేయాలని, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాప్తిని అరికట్టాలని, అనువంశిక వ్యాధులు సక్రమించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్, మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు, డీఐవో డాక్టర్ లూసీ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్య విద్యార్థుల బలవన్మరణం

- భవనాల మీద నుంచి దూకి ఆత్మహత్య
- చదువులో తీవ్ర ఒత్తిడే కారణం


విస్మాద్ సింగ్ (ఫైల్ ఫొటో)


శివాని జ్యోత్స్న మృతదేహం

ఎండాడ/పెందుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చదువులో తీవ్ర ఒత్తిడితో ఒకరు, బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేయలేనేనే ఆందోళనలో మరొకరు... జిల్లాలో ఒకేరోజు ఇద్దరు వైద్య విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌కు చెందిన విస్మాద్‌సింగ్ (20) నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ప్రాంగణంలోని హాస్టల్ (ఆరో అంతస్తు)లో ఉంటున్నాడు. బుధవారం ఉదయం తాను ఉంటున్న అంతస్తు నుంచి పదో అంతస్తుకు వెళ్లి, అక్కడి నుంచి కిందకు దూకేశాడు. ఇది చూసిన సిబ్బంది వెంటనే కళాశాలకు చెందిన ఆస్పత్రికి తరలించారు. అయితే తలకు బలమైన గాయమవ్వడంతో అప్పటికే మృతిచెందాడు. చదువు ఒత్తిడి తట్టుకోలేక, లోకం విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్టు పంజాబీ భాషలో రాసిన లేఖ హాస్టల్‌లోని అతడి గదిలో లభించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి తండ్రి హిమాచల్‌ప్రదేశ్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నారని, ఆయనకు సమాచారం అందించామని కళాశాల యాజమాన్యం తెలిపింది. దీనిపై కేసు నమోదు చేయనున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. మెడికల్ కళాశాల విద్యార్థి బలవన్మరణం చెందడం చాలా బాధాకరమని కళాశాల ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ భోగవల్లి కార్తీక్ పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా మాకవరపాలేనికి ... మిగతా 6వ పేజీలో

పెందుర్తి పూర్వపు తహశీల్దారు సహా పలువురిపై క్రమశిక్షణ చర్యలు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండల పూర్వ తహశీల్దారు, మరికొంతమంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అవినీతి నిరోధక శాఖ అధికారులు 2021 జూలై 20 నుంచి 22 తేదీల మధ్య పెందుర్తి తహశీల్దారు కార్యాలయంలో తనిఖీలు చేశారు. కార్యాలయంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నట్టు గుర్తించారు. దీని ప్రకారం ఏసీబీ డీజీకి విశాఖలోని ఏసీబీ అధికారులు నివేదిక సమర్పించారు. ఏసీబీ డీజీ సూచన మేరకు అప్పటి పెందుర్తి తహశీల్దారు పైల రామారావు, డిప్యూటీ తహశీల్దారు డి.శ్రీను, మండల సర్వేయర్ ఎస్.రాజగోపాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.ఈశ్వరరావు, వీఆర్వోలు డి.ఆనందకుమార్, జి.శామ్యూల్, జి. పెంటూరి, ఎన్.స్వాతి, బి.రమేష్‌నాయుడు, జి.దేవరాజ్, బి.కిరణ్‌లపై క్రమశిక్షణ చర్యలకు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సూచించారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల్లో ఉత్సాహం

- కొన్ని ఇబ్బందులున్నా ప్రజలకు మేలు చేసే క్రమంలో ముందుకు వెళ్లాల్సిందే...

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో సంస్కరణలను ప్రకటించిన వెంటనే అన్ని వర్గాల ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్ అన్నారు. బుధవారం పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌లో నెక్ట్ జనరేషన్ జీఎస్టీ రీఫార్మ్ (తరువాతి తరం జీఎస్టీ సంస్కరణలు) పేరుతో అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సదస్సుకు హాజరైన ఆమె వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధి కంకటాల మల్లిక్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు ఆనందంగా ఉన్నారని, ఈ మార్పులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ కావాల్సి ఉందన్నారు. నూతన మార్పులను అమలు చేసేందుకు కొంత సమయం కావాలన్నారు. రూ.2,500 కంటే ఎక్కువ ధర ఉన్న వస్త్రాలను 18 శాతం స్లాబ్‌లో పెట్టారని, వివాహాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో కొనుగోలు చేసే వస్త్రాలకు అది పెద్ద బడ్జెట్ కాదని, దీనిపై ఆలోచించాలన్నారు. ఇందుకు మంత్రి సీతారామన్ మాట్లాడుతూ దేశంలో కోట్లాది మంది ప్రజలకు మేలు జరుగుతున్నప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు ఉంటాయని, అయినా ముందుకు వెళ్లాలన్నారు. కొన్నిరకాల ట్యాక్స్‌లు కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితం అవుతాయని, జీఎస్టీ మాత్రం 140 కోట్ల మంది భారతీయులకు ... మిగతా 6వ పేజీలో



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు. చిత్రంలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు.

ఆగని రౌడీషీటర్ల ఆగడాలు

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు

- తరచూ ఎవరో ఒకరిపై దాడులు
- నిఘాలో పోలీసులు విఫలం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **నగరంలో రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్టపడడం లేదు. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా బేఖాతరు చేస్తున్నారు. తరచూ ఎక్కడో ఒకచోట దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని సీపీ ఆదేశించినా, స్టేషన్ స్థాయిలో అవి అమలు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

భీమిలి మండలం తాటితూరు గ్రామానికి చెందిన రౌడీషీటర్ పతివాడ వినోద్ అలియాస్ కిట్టు తన స్నేహితులతో కలిసి సోమవారం రాత్రి చిట్టివలస సమీపంలోని ఒక హోటల్‌కు వెళ్లాడు. అక్కడ పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేందుకు వచ్చిన పవన్‌కుమార్ అనే యువకుడితో గొడవపడ్డాడు. తన స్నేహితులతో కలిసి పవన్‌కుమార్‌ను తీవ్రంగా కొట్టి, అనంతరం బైక్‌పై ఈడ్చుకుంటూ తీసుకువెళ్లాడు. ప్రాణాపాయ స్థితిలో పవన్‌కుమార్ ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నగరంలో ఈ తరహా ఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామంటూ ఉన్నతాధికారులు చేస్తున్న హెచ్చరికలు ప్రకటలకే పరిమితం అవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రౌడీషీటర్ల కదలికలపై నిశితంగా నిఘా పెట్టాలని, ఉదయం ఏ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళుతున్నారు, ఎవరిని కలుస్తున్నారు? ఎక్కడెక్కడకు వెళుతున్నారు?, ఏ పనిచేస్తున్నారనే దానితోపాటు నగరం విడిచివెళితే తక్షణం సమాచారం అందించే బాధ్యతను ఒక కానిస్టేబుల్‌కు అప్పగించాలని సీపీ శంఖబ్రతబాగ్చి అన్ని స్టేషన్ల సీఐలను ఆదేశించారు. అలాగే ప్రతి ఆదివారం రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిచి పరేడ్ నిర్వహించడంతోపాటు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అయితే కౌన్సెలింగ్‌కు కొంతమంది రౌడీషీటర్లు గైర్హాజరవుతున్నా వారిపై సీఐలు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిని అలుసుగా తీసుకుని రౌడీషీటర్లలో ... మిగతా 6వ పేజీలో

తప్పుల తడకలుగా స్మార్ట్ రైస్ కార్డులు

మారిపోయిన పేర్లు, చిరునామాలు

- మరోవైపు చాలామందికి అందని కార్డులు
- రేషన్ డిపోల చుట్టూ లబ్ధిదారుల చక్కర్లు
- సహకరించని డీలర్లు

గాజువాక/మురళీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): **స్మార్ట్ రైస్ కార్డుల్లో వివరాలు తప్పుల తడకలుగా ఉండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తమ కార్డు ఏ డిపోలో ఉందో తెలియక కొందరు డిపోల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.**

పౌర సరఫరాల శాఖ ఇటీవల ముద్రించి పంపిణీ చేసిన స్మార్ట్ రైస్ కార్డుల ముద్రణలో లబ్ధిదారుల పేర్లు, చిరునామా, ఇతర వివరాలు ఆంగ్లం నుంచి తెలుగులోకి తర్జుమా చేశారు. దీంతో కార్డుదారుని పేరులో సంబంధం లేని అక్షరాలు ముద్రితమయ్యాయి. చిరునామాల్లో కూడా తప్పులు దొర్లాయి. అంతేకాకుండా కార్డుదారుని ఫొటోకు బదులుగా మరొకరి ఫొటో ముద్రించారు. ఉర్దూ అక్షరాలు, అచ్చ తెలుగు సంఖ్యలు ముద్రించారు. కుటుంబంలోని వ్యక్తుల సంబంధాలను తప్పుగా నమోదు చేశారు. భర్తను తండ్రిగా, కొడుకుని తమ్ముడిగా పేర్కొన్నారు. పేర్లలోనూ తప్పులు చోటుచేసుకున్నాయి. ఇంటి పేర్లు కార్డుదారులే పోల్చుకోలేనంతగా దారుణంగా ఉన్నాయి. ఇలా ప్రతి డిపోలో ఐదు నుంచి పది శాతం కార్డుల్లో తప్పులున్నాయి. దీనిపై ఆందోళన వద్దని ఆందోళన వద్దని, నుంచి సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తులు ఇచ్చి సరి చేసుకోవాలని పౌర సరఫరాల అధికారులు పేర్కొంటున్నారు.



స్మార్ట్‌కార్డులో తప్పుగా నమోదైన పేరు

కార్డు కోసం తిప్పలు

స్మార్ట్ కార్డుల ... మిగతా 6వ పేజీలో

బార్‌లకు ఆదరణ నిల్

- 63 బార్‌లకు రెండోసారి నోటిఫికేషన్ జారీ
- కేవలం 11 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు
- నేడు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో లాటరీ ద్వారా కేటాయింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు ఆదరణ కరువైంది. తొలిదశ నోటిఫికేషన్‌లో భర్తీకాని బార్లకు రెండోసారి అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. దరఖాస్తుకు గడువు బుధవారంతో ముగిసింది. అయితే కేవలం 11 బార్లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు రావడంతో వాటికి గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో లాటరీ నిర్వహించనున్నారు. జిల్లాలో 121 బార్ అండ్ రెస్టారెంట్‌లను ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసింది. బార్‌ల కేటాయింపు లాటరీ విధానంలో చేపట్టేలా గత నెలలో నోటిఫికేషన్ జారీచేసింది. ఒక్కోబార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలని, లేనిపక్షంలో లాటరీ నిర్వహించరాదని నిబంధన విధించింది. అయితే కొత్తబార్‌పాలసీ వ్యాపారులకు పెద్దగా అనుకూలంగా లేకపోవడంతో వ్యాపారులు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపలేదు. జిల్లాలో 121 బార్‌లకు నోటిఫికేషన్ జారీ చేస్తే 58 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు రావడంతో వాటికి లాటరీ నిర్వహించారు. మిగిలిన 63 బార్‌లకు ... మిగతా 6వ పేజీలో

పీఎం మోదీ పేరిట పూజలు

సింహాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పేరిట బీజేపీ 98వ వార్డు నాయకులు సింహగిరి తొలిపావంచా వద్ద పూజలు చేశారు. అప్పన్న స్వామికి కొబ్బరికాయలు కొట్టి మోదీ ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం వరాహ పుష్కరిణి పరిసరాల్లో స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సుహాసిని, రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ, బి.అప్పలనాయుడు, జి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 డీఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. ఈ కారణంగా చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్డు, దుర్గానగర్-1, 2, కృష్ణానగర్, పోర్టు కాలనీ, గణేశ్‌నగర్, కళానగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు కాలనీ, శ్రీనివాస్‌నగర్, నగరంపాలెం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'వయోవందన' సద్వినియోగం చేసుకోవాలి

పద్మనాభం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న వయోవందన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అసిస్టెంటు డైరెక్టర్ కె.కవిత కోరారు. పీఎం మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్ ప్రాంగణంలో బీజేపీ వైద్య విభాగం, గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రూపాకుల రవికుమార్, టి.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

బార్‌లకు ఆదరణ నిల్

... 5వ పేజీ తరువాయి

ఇటీవల రెండోసారి నోటిఫికేషన్ జారీచేయగా కేవలం 11 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి. దీంతో మరో 52 బార్‌లు కేటాయింపునకు నోచుకోని పరిస్థితి ఏర్పడింది. నాలుగేసి దరఖాస్తులు వచ్చిన 11 బార్లను కేటాయించేందుకు గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో లాటరీ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒకర కంగా చెప్పాలంటే విశాఖ జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు బార్‌లకు దరఖాస్తులు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందువల్లే రా ష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో కంటే విశాఖ జిల్లా లో అత్యధికంగా బార్‌ల కేటాయింపు జరిగింది.

'స్వస్థ్ నారీ సశక్త్'ను విజయవంతం చేయాలి

» మండల ప్రత్యేకాధికారి కె.జ్ఞానవేణి, ఎంపీపీ కె.రాంబాబు

పద్మనాభం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.జ్ఞానవేణి, ఎంపీపీ కె.రాంబాబులు కోరారు. మండలంలోని రేవిడి పీహెచ్‌సీలో బుధవారం వారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంతో పాటు మహిళలు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారంపై ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.లీలాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో తక్కువ బరువు కలిగిన ఇద్దరు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్నట్టు తెలుసుకుని వారిని దత్తత తీసుకునేందుకు జ్ఞానవేణి ముందుకువచ్చారు. గెడ్డపేట అంగన్‌వాడీ కేంద్రం నుంచి కె.ప్రీతి, అనంతవరం కేంద్రం నుంచి కె.వేదాన్షిలను ఆమె దత్తత తీసుకున్నారు. స్థానిక నాయకులు గంగరాజు, కోన రమణ, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 2 వరకు ప్రత్యేక శిబిరాలు

మధురవాడ: మహిళల ఆరోగ్యం కోసం వచ్చే అక్టోబరు 2 వరకు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు వైద్య వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా గురువారం మిథిలాపురి వుడాకాలనీ, సాగర్‌నగర్ యూపీహెచ్‌సీల్లో, ఆనందపురం పీహెచ్‌సీలో, ఈ నెల 19న కొమ్మాది యూపీహెచ్‌సీలో, 21న స్వతంత్రనగర్, చేపలుప్పాడ యూపీహెచ్‌సీల్లో, 23న పీఎంపాలెం యూపీహెచ్‌సీ, 24న మారికివలస యూపీహెచ్‌సీ, రేవిడి పీహెచ్‌సీ, 25న భీమిలి యూపీహెచ్‌సీలో, మధురవాడ, ఆర్.తాళ్లవలస పీహెచ్‌సీల్లో, 27న రుషికొండ, ఎండాడ, దుర్గానగర్ యూపీహెచ్‌సీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జ్ఞానవేణి

వైభవంగా సింహాచలేశుని తిరువీధి ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న సింహాద్రి అప్పన్న స్వామి

సింహాచలం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పవిత్ర ఏకాదశిని పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలతో అలంకరించి పల్లకీలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వర ఆలాపనలు, పండితుల వేదపఠనాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ సింహగిరి మాడవీధుల్లో తిరువీధిని చేపట్టారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి వివిధ రకాల పండ్లను నివేదించారు.

సింహాద్రి అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన

సింహాద్రి అప్పన్న స్వామికి బుధవారం వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన చేశారు. ఏకాదశి సందర్భంగా వేకువజామున స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలను పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించాక నారసింహ అష్టోత్తర శత నామావళిని పఠిస్తూ స్వర్ణ తులసీ దళాలతో పూజ జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత ఇదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణాన్ని నిర్వహించారు.

అన్నదానానికి రూ.రూ.1,00,116 విరాళం

సింహాద్రినాథుని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన భూపతిరాజు విశ్వనాథరాజు, శ్రీలక్ష్మి దంపతులు రూ.1,00,116ను ఏఈవో వి.రమణమూర్తికి అందజేశారు. ఆచారం ప్రకారం దాత కుటుంబీకులకు అంతరాలయ దర్శన భాగ్యాన్ని శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

ఎండాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధిలో గ్రేటర్ వర్క్స్ విభాగం అధికారులు బుధవారం ప్రభుత్వ భూమి ఆక్రమిత ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి సిద్ధపడగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. వార్డు పరిధిలోని హయగ్రీవ ప్రాజెక్టు కింద రాజీవ్ నగర్ కొండ ప్రాంతంలో పలువురు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ప్రాంతంలో వర్క్స్ విభాగం అధికారులు సర్కారు సొమ్ముతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఎక్స్‌కవేటర్‌తో సిద్ధమయ్యారు. అయితే రెవెన్యూ వీఆర్వో వెంకటేశ్ ఈ పనులను అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఇప్పటికే ఇక్కడ అక్రమంగా పలువురు నిర్మాణాలు చేపట్టారని, ఇందుకు సంబంధించి పలుచోట్ల హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయడంతో పాటు ఈ విషయాన్ని తహశీల్దార్, ఆర్డీవోలకు నివేదించామని వివరించారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించే అవకాశం ఉందని, అందువల్ల రహదారి నిర్మాణ పనులను నిలిపివేయాలని వర్క్స్ విభాగం సిబ్బందికి చెప్పడంతో వారు ఎక్స్‌కవేటర్‌ను తీసుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారు.



పాండ్రంగిలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసిన నాయకులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

పద్మనాభం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండ్రంగిలో విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవతల వాస్తుశిల్పి అయిన విశ్వకర్మ ఎన్నో ఇంజనీరింగ్ అద్భుతాలకు సాక్షిభూతంగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. వృత్తి పనివారికి విశ్వకర్మ పేరుతో ప్రధాని మోదీ కల్పించిన ఉపాధి పథకం ఎంతోమందికి ఉపయుక్తంగా నిలిచిందన్నారు. టీడీపీ నాయకులు కె.రామరాజు, మహంతి శ్రీను, బి.సంతోశ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బి.సత్యశ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు పరిధిలో గల విశ్వకర్మ ఆలయంలో మధురవాడ విశ్వకర్మ భగవాన్ కార్పెంటర్స్ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం విశ్వకర్మ పూజ, అభిషేకాలు, వ్రతాలు, హోమం, యజ్ఞాలను జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కూటమి నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా నరసింగరావు, డి.శ్రీనివాస్, ఎం.సోంబాబు, గోపి, శాఖరి శ్రీనివాస్, పి.శ్రీనివాస్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పి.హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌సర్‌లో జాతీయ ఔషధ భద్రతా వారోత్సవాలు

ఎండాడ/సాగర్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు జాతీయ ఔషధ భద్రత పర్యవేక్షణ వారోత్సవాలను గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్పీ రావు, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ తులసీ మాధురి, ఫ్యాకల్టీ సభ్యులు ఎ.శ్యామ్‌కుమార్, ఎన్.సింధూర, కేవీ పూజిత, ఎ.కృష్ణసాయి, జి.వినీల, తదతరులు పాల్గొన్నారు.

అలాగే గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో ఏఎంసీ ఫార్మకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ డి.శ్యామల మాట్లాడుతూ ఔషధాలను వినియోగించేటప్పుడు ఏమైనా దుష్పరిణామాలు ఎదురైతే సంబంధిత అధికారులకు ఎలా తెలియజేయాలో వివరించారు. ఏఎంసీ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.భీమేశ్‌నాయుడు, డాక్టర్ ఎం.రచన, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.స్వర్ణలత, ఫార్మసీ ప్రొఫెసర్లు డాక్టర్ పి.నరేష్, డాక్టర్ ఆర్.బి.నలంద, తదితరులు పాల్గొన్నారు.

'స్వస్థ్ నారీ సశక్త్' వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న కార్పొరేటర్ చిన్నికుమారిలక్ష్మి

తగరపువలస, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని 2వ వార్డు కార్పొరేటర్ చిన్నికుమారిలక్ష్మి కోరారు. స్థానిక యూపీహెచ్‌సీలో వైద్య శిబిరాలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ శిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేస్తారని తెలిపారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం తల్లి, బిడ్డల సేవలు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కిశోర బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 254 మందికి పరీక్షలు చేశామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, వైద్యులు ఝాన్సి, హైమావతి, మౌనికా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినోత్సవాన్ని పట్టణంలో కూటమి నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర నరేంద్ర మోదీ సేవా సంఘం కన్వీనర్ సత్తరవు వాయునందనరావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా రాజకీయ జీవితంలో అలుపెరగని ప్రజా సేవకునిగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫణికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

భీమునిపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆనందపురం మండలంలో బూరుగుపేటకు చెందిన బర్ల సాయి ఆటో ప్రమాదంలో తీవ్రగాయాలపాలైయాడు. దీంతో అతని వైద్య ఖర్చుల నిమిత్తం భీమిలి కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో బాధితుడి తండ్రి ఆ చెక్కును తీసుకున్నారు.

గంభీరంలో స్వచ్ఛసర్వేక్షణ్ బృందం పర్యటన

ఆనందపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరం పంచాయతీ 'స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025' అవార్డుకు ఎంపికవడంతో థర్డ్‌పార్టీ వెరిఫికేషన్ నిమిత్తం స్టేట్ నుంచి పి.చిరంజీవి ఆధ్వర్యంలో బృందం పంచాయతీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి నుంచి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, ఎస్‌డబ్లూపీసీ షెడ్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ పరిశీలించి సలహాలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని వేములవలస, పెద్దిపాలెం పంచాయతీలు కూడా ఈ అవార్డుకు ఎంపికైయాయని, వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జానకి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, సర్పంచ్ వానపల్లి లక్ష్మి, పాల్గొన్నారు.

కేంద్ర బీమా పథకాలపై అవగాహన ఉండాలి

» ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్



కేంద్ర బీమాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

భీమునిపట్నం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్ అన్నారు. మండలంలోని అమనాం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, భీమిలి బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నమినీ, సైబర్ క్రైమ్‌లపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయా పథకాలు, ప్రయోజనాలపై బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ జన్‌ధన్ ఖాతాల నవీకరణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏపీజీబీ బ్యాంక్ సేవలను వివరించారు. ఈ కర్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, భీమిలి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇందిర, వెలుగు పథకం ఏపీఎమ్ నాగభూషణం, సీసీ అప్పలనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌పై అవగాహన

» జిల్లా ప్రాజెక్టు అధికారి వైదేహి

ఆనందపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం జిల్లా ప్రాజెక్టు అధికారి వైదేహి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలు తమ పొదుపులు, అప్పులు, చెల్లింపులు వంటి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈయాప్‌లో వాయిస్ రికార్డింగ్ రూపంలో కూడా వివరాలు అందుబాటులో ఉంటాయని డెమో చూపించారు. అలాగే గత ఏడాది సాధించిన ప్రగతిని సమీక్షించి, రాబోయే సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రణాళికను సభలో ఆమోదించారు. అనంతరం "సంఘం మనదే.... డబ్బు మనదే.... విజయం మనదే.... లెక్కలు మనవే" అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సత్యంనాయుడు, ఏపీఎం రేణుక, మండల ఏపీఎం ఎస్తేరు రాణి, ఎఫ్‌పీవో ప్రభ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

భీమునిపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణాకాలనీలో ఉన్న 33/11 కేవీ తాళ్లవలస సబ్‌స్టేషన్, భీమిలి రూరల్, భీమిలిటౌన్ ఫీడర్‌లైన్‌లలో ఉన్న విద్యుత్ తీగలపై పడుతున్న కొమ్మలు తొలగించడం, తదితర మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్3 ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా తాతాజీ నగర్, బ్యాంక్ కాలనీ, యల్లమ్మపేట, మహాలక్ష్మిపురం, డెక్కతిపాలెం, రాజలింగపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు, జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, భీమిలి టౌన్, తాళ్లవలస, రాయనిపేట, ఎరుసుపేట, లెజెండ్ లేఅవుట్, ఓనుముపేట, మహిత లేఅవుట్, హార్మోనీ లేఅవుట్ ప్రజలు సహకరించాలని కోరారు.

నగరంపాలెం రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు

మధురవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మధురవాడ కూడలి నుంచి నగరంపాలెం వెళ్లే రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ఈ రోడ్డులో ఇరువైపులా అనధికారిక మార్కెట్ నిర్వహించడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. చేపలు, కూరగాయలు, పండ్లు విక్రయాలను రోడ్డుకి ఇరువైపులా ఏర్పాటు చేయడంతో ఈ సమస్య రెట్టింపు అవుతుంది. కొనుగోలుదారులు ద్విచక్ర వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉంచడంతో ఆ దారిన వెళ్లే వాహనదారులకు మార్గం ఉండడం లేదు. ఈ రోడ్డు మీదుగానే నగరంపాలెం, మల్లయ్యపాలెం, వాంబేకాలనీ, అయోధ్యనగర్, పోర్టుకాలనీ, స్వతంత్రనగర్ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. చిరువ్యాపారులకు నగరంపాలెం రోడ్డులో హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు పరిష్కారమవుతుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.



రోడ్డుపై అస్తవ్యస్తంగా వాహనాలను నిలిపి ఉంచిన దృశ్యం

మేనేజ్‌మెంట్ రంగంలో ఉపాధి అవకాశాలు

మధురవాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని అందుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు సొంతం చేసుకోవాలని శ్రీనివాసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) కరస్పాండెంట్ ఎస్‌పీ రవీంద్ర అన్నారు. ఇక్కడి సిమ్స్ కళాశాలలో బుధవారం 2025-27 ఎంబీఏ, ఎంసీఏ బ్యాచ్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని పూర్తి స్థాయి నైపుణ్యాలతో వెళ్లాలన్నారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఎస్.విజయారవీంద్ర, ప్రిన్సిపాల్ యు.లారెన్స్, డైరెక్టర్ వి.సాయిప్రసాంత్, ఐఐఏఎం డీజీ ప్రొఫెసర్ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

దసరా రాట ఉత్సవం

ఆనందపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలోని లొడగలవానిపాలెంలో రాట పూజ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ దంపతులు పూజలు చేశారు. సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రాట ఉత్సవంలో కమిటీ సభ్యులు

జీవీఎంసీ విస్తరణ?

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయని సీఎం వద్ద పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రస్తావించారు. ప్రధానంగా పెందుర్తి మండలం దాదాపు జీవీఎంసీలో ఉంటుందని చెబుతూ గ్రామీణ ప్రాంతంగా ఉన్న పంచాయతీలను కూడా నగర పాలక సంస్థలో విలీనం చేయాలని కోరారు. ఆనందపురం, భీమిలి రూరల్, పద్మనాభం మండలాలను కూడా జీవీఎంసీలో విలీనం చేస్తే జిల్లా మొత్తం ఒక నగర పాలక సంస్థ పరిధిలోకి వస్తుందని, ఇదే విషయం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గతంలో ప్రస్తావించారని పేర్కొన్నారు. అందుకు ముఖ్యమంత్రి స్పందిస్తూ పెందుర్తి ఎమ్మెల్యే ప్రతిపాదనను పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. అలాగే 11 మండలాలున్న జిల్లా పరిధిని కొంతమేర విస్తరించాలని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ప్రస్తావిస్తూ ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖలో విలీనం చేయాలని అక్కడ ప్రజలు కోరుతున్నారని వివరించారు. ఈ దశలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీలో ఉన్న లక్షల మంది ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా మౌలిక వసతులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జీవీఎంసీని విస్తరిస్తే మంచిదేనని, అప్పుడు జిల్లా మొత్తం నగర పాలక సంస్థ పరిధిలో ఉంటుందన్నారు. పద్మనాభం ఒక్కటే నగరానికి దూరంగా ఉన్నందున ఆ ఒక్క మండలాన్ని గ్రామీణ ప్రాంతంగా ఉంచలేమన్నారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి జిల్లాలోని నాలుగు మండలాలను జీవీఎంసీలో విలీనం చేయకపోతే మరోసారి జడ్పీ ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా జరిగే అవకాశం ఉందని పంచకర్ల సందేహం వ్యక్తంచేశారు. ఇదిలావుండగా నగరంలో కార్యక్రమాలు పూర్తయిన అనంతరం విమానాశ్రయానికి చంద్రబాబునాయుడుతో పాటు వాహనంలో పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, మరొకరు వెళ్లారు. ఈ సందర్భంగా నగరంలో పాలన, ప్రజారోగ్యం, వీధి లైట్లు, తాగునీరు, రోడ్ల నిర్వహణ ప్రధానంగా గుంతలు పూడ్చడం గురించి కలెక్టర్‌ను అడిగి సీఎం తెలుసుకున్నారు. రోజువారీ పారిశుధ్యం బాగా లేకపోయినా, చెత్త తరలింపులో జాప్యం కనిపించినా ప్రజల నుంచి అసంతృప్తి వస్తుందని స్పష్టంచేశారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. వీధి లైట్లు నిర్వహణ, తాగునీటి సరఫరాపై రోజువారీ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని అంశాలను పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించారు. తాజా బదిలీల్లో నగరం నుంచి ఒక డీసీపీని బదిలీ చేసినా ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదని మరో ఏడీసీపీ, ఐదు ఏసీపీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నగరానికి కనీసం ఇద్దరు ఐపీఎస్ అధికారులను కేటాయించాలని, మిగిలిన అధికారుల ఖాళీలను భర్తీచేయాలని కోరగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఉక్కునగరంలో మూసివేసిన విశాఖ విమల విద్యాలయాన్ని తిరిగి తెరిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకుగాను అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను గ్రాంటు ఇన్‌ఎయిడ్ ద్వారా జీతాలు ఇవ్వాలని కోరగా సీఎం పరిశీలిస్తామన్నారు. సుమారు 1,600 మంది విద్యార్థులున్న పాఠశాలను ప్రభుత్వం తీసుకోవాలనే ప్రతిపాదనను పరిశీలిస్తానన్నారు. కాగా ఈ పర్యాయం వచ్చినప్పుడు నగర కేడర్‌తో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుంటానని పల్లాకు చంద్రబాబు హామీ ఇచ్చారు. కేడర్‌ను ఎప్పటికప్పుడు కలిసి వారి సమస్యలు తెలుసుకోవాల్సి ఉందని, కష్టకాలంలో ఉన్నప్పుడు అనేక కష్టనష్టాలకు ఓర్చి పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు.

తప్పులతడకలుగా స్మార్ట్ రైస్‌కార్డులు

... 5వ పేజీ తరువాయి

పంపిణీలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డిపోలకు వెళ్లి వాకబు చేసినా అక్కడ లేవని సమాధానం వస్తోంది. కార్డుదారుల వివరాలకు అతని ఫోన్ నంబర్ లింకేజీ ఆప్షన్ లేకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా వీధుల్లో కార్డుదారులకు సరుకులిచ్చారు. ఈ క్రమంలో డిపోలకు, కార్డుదారులకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. దీంతో లబ్ధిదారుల చిరునామాల మార్పుపై అప్‌డేట్ లేదు. జగన్ ప్రభుత్వంలో వలంటరీ వ్యవస్థలో పనిచేసిన తాత్కాలిక సిబ్బంది ఇష్టారీతిన కార్డుదారుల చిరునామాలను మ్యాపింగ్ చేశారు. ఎక్కడో నివాసం ఉంటున్న వారిని స్థానిక సచివాలయానికి మ్యాపింగ్ చేసి వదిలేయడంతో తాజాగా జారీ అయిన స్మార్ట్ రేషన్ కార్డులు పాత చిరునామాలకే చేరాయి. అంటే నిత్యం రేషన్ తీసుకుంటున్న డిపో ఒకటైతే, కార్డు సచివాలయ మ్యాపింగ్ ఆధారంగా వేరే డిపోకు కార్డులు వెళ్లిపోయాయి. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారి విషయంలోనూ ఇదే జరిగింది. కార్డులు వచ్చిన రోజు నుంచి రేషన్ లబ్ధిదారులు సచివాలయాలు, రేషన్ డిపోల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఆన్‌లైన్‌లో కార్డు ఏ డిపోలో ఉందో తెలుసుకునే అవకాశం ఉన్నా కొందరు డీలర్లు ఆ పనిచేయడం లేదనే వాదన ఉంది. ఇదిలావుండగా కొంతమంది రేషన్ డీలర్లు..కార్డుల కోసం డిపోలకు వెళ్లినవారి వేలిముద్ర తీసుకుని బియ్యం బదులు డబ్బు ఇస్తున్నారు. కొత్త కార్డు ఎక్కడుదంటే..మా దగ్గర లేదు...ఎక్కడుందో తెలుసుకోవాలంటే తరువాత రండి అని పంపిస్తున్నారు. ప్రధానంగా వన్‌టౌన్ ఏరియాలో స్మార్ట్ కార్డుల కోసం డీలర్లు పూర్తిగా సహకరించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు వైద్య విద్యార్థుల బలవన్మరణం

... 5వ పేజీ తరువాయి

చెందిన చింతల దేవుడు, గౌరి దంపతుల కుమార్తె శివాని జ్యోత్స్న (21) శివారు ప్రాంతంలో గల కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రథమ సంవత్సరంలో బ్యాగ్‌లాగ్స్ ఉండిపోయాయి. వాటిని క్లియర్ చేయడంలో భాగంగా చదువుకునేందుకు ఈనెల 15న సుజాతనగర్‌లోని ఓ అపార్టుమెంటులో నివసిస్తున్న తన మేనమామ ఇంటికి వచ్చింది. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ముభావంగానే ఉండేది. బ్యాక్‌ల్యాగ్స్ గురించి ఆలోచిస్తూ తీవ్ర ఒత్తిడితో ఆందోళన చెందుతుండేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఏడు గంటలకు చదువుకుంటానంటూ అపార్టుమెంట్ టెర్రస్ ఎక్కింది. కొంతసేపటి తరువాత టెర్రస్ మీద నుంచి కిందకు దూకేసింది. అకస్మాత్తుగా పెద్ద శబ్దం రావడంతో సెల్లార్‌లో వాకింగ్ చేస్తున్నవారు హుటాహుటిన అక్కడికి చేరుకునారు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే పెందుర్తి సీహెచ్‌సీకి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా భద్రతలో విశాఖ టాప్

... 5వ పేజీ తరువాయి

గ్లోబల్ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం ప్రజలు చాలా మంచివారని, మహిళా పారిశ్రామికవేత్తలు కూడా ఇక్కడ ఉన్నారని, వారు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి వచ్చే నెలలోనే గూగుల్ విశాఖపట్నం వస్తుందని ప్రకటించారు. అదేవిధంగా భోగాపురంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం వచ్చే వచ్చే ఏడాది ఆగస్టు నుంచి ఆపరేషన్లు ప్రారంభిస్తుందన్నారు. విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు జీఎంఆర్‌ను, ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అనుసంధానం చేశామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల తయారీలో అది కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. విశాఖపట్నానికి మెట్రో రైలును తీసుకురావడానికి కృషిచేస్తున్నామని చెప్పారు.

ఆగని రౌడీషీటర్ల ఆగడాలు

... 5వ పేజీ తరువాయి

కొందరు దందాలు, దౌర్జన్యాలు చేస్తున్నారు. సెటిల్‌మెంట్‌లలో తలదూర్చుతున్నారు. రౌడీషీటర్లు రాత్రి తొమ్మిది గంటలయ్యేసరికి ఇంటికి చేరకపోయినా, ఆ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినా...వారిపై నిఘా పెట్టిన కానిస్టేబుల్ అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. కానీ, ఇది ఎక్కడా జరగడం లేదు. దీనివల్ల రౌడీషీటర్లు అర్ధరాత్రిపూట నగరంలో విచ్చలవిడిగా తిరుగుతూ ఎదుటివారిపై దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా రౌడీషీటర్లపై సీపీ సీరియస్‌గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నగరవాసులు అంటున్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల్లో ఉత్సాహం

... 5వ పేజీ తరువాయి

వర్తిస్తుందన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తరువాత రోజు నుంచే వాటిని అమలు చేసేందుకు అనేక సంస్థలు ముందుకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. సిమెంట్ పరిశ్రమకు చెందిన ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ సిమెంట్‌ను 28 నుంచి 18 శాతం స్లాబ్‌కు మార్చడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు సంబంధించిన సాంకేతిక ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్య రంగానికి చెందిన ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ వ్యక్తిగత ఇన్సూరెన్స్‌లకు సంబంధించి స్లాబ్‌లను జీరో చేశారని, గ్రూపు పాలసీలకు సంబంధించి కూడా ఇదే తరహా నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు.

ఎంవీపీ సీఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకారం



ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐగా కేవీఎస్ వీఎస్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన జె.మురళీని వీఆర్‌కు సరెండర్ చేయడంతో ద్వారకానగర్ సర్కిల్ ట్రాఫిక్ సీఐగా ఉన్న ప్రసాద్‌ను ఈ స్థానంలోకి బదిలీ చేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన ప్రసాద్ గతంలో ఇదే స్టేషన్‌లో కొద్ది కాలం పని చేశారు. గతంలో ఆయన అన్నవరం, అనకాపల్లి టౌన్, నర్సీపట్నం, చింతపల్లి సర్కిల్, అనకాపల్లి రూరల్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. ప్రజలు, సిబ్బంది సహాయ సహకారాలతో శాంతి భద్రతల పరిరక్షణకు పని చేస్తానని ఆయన తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 11 కేవీ ఫీడర్ మరమ్మత్తులతో పాటు చెట్ల కొమ్మలు తొలగింపు కార్యక్రమం చేపడుతున్న నేపథ్యంలో ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేస్తున్నట్టు సంబంధిత జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్-2, శ్రీరామనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట

వెంకోజీపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీలో గల సంజయ్‌గాంధీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు బుధవారం పందిరి రాట వేశారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల్లో కనకదుర్గ అమ్మవారిని ప్రతి రోజు ఒక్కో అవతారంలో అలంకరించి, పూజలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ నవరాత్రుల్లో భాగంగా పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు, మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, ప్రతిరోజు ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6 గంటలకు సహస్రనామ కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. 22న ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం భక్తుల స్వహస్తాలతో నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు డి.సుందరరావు, ఎస్వీఏ నారాయణరావు, ఎస్వీ మురళీకృష్ణ, అర్చకులు వెంకటరావు శర్మ, సూర్యనారాయణ, మళ్ల దుర్గా పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 22, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

20వ వార్డులో రూ.2.55 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదవాల్తేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రూ.2.55 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన బుధవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెదవాల్తేరు, కాగితాలవీధి, పెదవాల్తేరు అమ్మవారివీధి, మున్సబ్ వారి వీధి, నౌకనగర్ స్కూల్, శ్రామికనగర్, ఈస్టుపాయింట్ కాలనీ, కేడీపీఎం స్కూల్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వంతెన నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, కాళ్ల శంకర్, గోవింద్ రెడ్డి, కంబాపు శివారెడ్డి, చితపాక రాజ్యాలక్ష్మి, నీలాపు చంద్ర శస్త్రఖర్, మద్ది శ్రీనివాసరెడ్డి, పి.వాసు, పి.శ్రీను, కాకి శివ శంకర్‌రెడ్డి, చిల్లా గోపి, చెల్లిబోయిన ఘన రమేష్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న టీడీపీ నేతలు

దేవీ నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



శరన్నవరాత్రుల ఉత్సవాల ఫ్లెక్సీలు, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తే ర్‌లోని వెలసిన కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దే వాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేం దుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. బుధ వారం చినవాల్తేర్‌లోని శ్రీకనకమహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా చేపట్టాలన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకూ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దుర్గామ్మ తల్లి ఆశీస్సులు రాష్ట్ర, నియోజకవర్గం ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.గాయత్రి, టీడీపీ నాయకులు పీతల అమరేంద్ర, బొట్టా రమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు మొరాయించకుండా చూడండి : ఆర్టీసీ ఆర్‌ఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణం మధ్యలో బస్సులు మొరాయించకుండా చూసుకోవాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. రీజియన్‌లోని ఏడు డిపో గ్యారేజీల మెకానికల్, అసిస్టెంట్ ఇంజనీర్లతో బుధవారం సమావేశమయ్యారు. స్త్రీశక్తి పథకం అమలు తరువాత అన్ని బస్సులు రద్దీని సంతరించుకుంటున్నాయని, మార్గమధ్యలో ఆగిపోతే వెనుక వచ్చే బస్సులో సర్దుబాటు చేసే అవకాశం కూడా లేదన్నారు. డిపోనుంచి బయలుదేరిన బస్సు రాత్రి తిరిగి వచ్చేవరకు పూర్తి సామర్థ్యంతో రవాణా సేవలందించాలన్నా రు. మెకానికల్ ఇంజనీర్లు బస్సులను ప్రతి రోజూ పరిశీలించి, ఫిట్‌గా ఉండేలా చూడాలన్నారు. సాంకేతిక కారణాలతో ఏ రూట్ బస్సు ఆగినా ఆ ప్రభావం మిగిలిన బస్సులపై పడుతుందన్నారు. స్త్రీశక్తిపథకం అమలవుతున్న సందర్భంలో బస్సుల సాంకేతిక నాణ్యత పెరగాల్సి ఉందని, అందుకు మెకానికల్ ఇంజనీర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, అసిస్టెంట్ ఇంజనీర్లు రామకృష్ణ, ప్రసాద్, రాజేశ్వరి, అశ్వని, చారి, ప్రశాంతి, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు ఎంఎస్ రావు, డీఆర్‌కే రాజు, వల్లి పాల్గొన్నారు.

పోర్టు అథారిటీలో స్వచ్ఛత పక్వాడ్



ప్రతిజ్ఞ చేస్తున్న పోర్టు అధికారులు

సిరిపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోర్ట్ అథారిటీలో బుధవారం స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ భవన ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ పోర్ట్ అథారిటీ ఉపాధ్యక్షుడు దుర్గేష్ కుమార్ దుబే, ఆయా విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు. 2024-25 సంవత్సరానికి స్వచ్ఛత పక్వాడ్ అవార్డ్స్‌లో దేశంలో విశాఖపట్నం పోర్టు నంబర్‌వన్‌గా నిలిచిందని వీపీఏ ఉపాధ్యక్షుడు దుర్గేష్‌కుమార్ దుబే తెలిపారు. ఇదే స్ఫూర్తితో 'స్వచ్ఛ ఉత్సవ్' అనే థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. బుధవారం ప్రారంభమైన స్వచ్ఛత పక్వాడ్‌కార్యక్రమాలు అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు.ఇలాంటి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో పని చేసి, అన్ని విభాగాల్లో విశాఖ పోర్టును దేశంలో నంబర్‌వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.

సింగపూర్ జూను సందర్శించిన ఎంపీ శ్రీభరత్



సింగపూర్ జూలో జంతువులను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్



బేస్ క్యాంప్‌లో ఎంపీ శ్రీభరత్

ఎండాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సింగపూర్ పర్యటనలో ఉన్న విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మండై వైల్డ్‌లైఫ్ గ్రూపు, సింగపూర్ జూలను బుధవారం సందర్శించారు. ప్రపంచ ప్రఖ్యాత వన్య ప్రాణుల నిర్వహణ పద్ధతులను అధ్యయనం చేసి వాటిని విశాఖ జూ పార్కు, కంబాలకొండ వన్యప్రాణి అభయారణ్యంలో అమలుచేసే అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండై వైల్డ్ లైఫ్ గ్రూపు సీఈవో మైక్ బార్కేతో చర్చలు జరిపారు. నగంరలోనే అడవి వాతావరణాన్ని కల్పించడం, వన్యప్రాణుల సంరక్షణ ప్రమాణాలను మెరుగుపర్చడంతో పాటు, సుస్థిర హరిత ప్రదేశాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలను తెలుసుకున్నారు.

విశాఖ వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉన్న స్థానిక మొక్కలతో హరిత వాతావరణాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. అనంతరం ప్రసిద్ధ నైట్ సఫారీలో పాల్గొన్నారు. పర్యాటకులకు ఇచ్చే అనుభవం, భద్రతా ప్రమాణాలు, జంతువులకు అనుకూల వాతావరణం వంటి అంశాలు పరిశీలించారు. విశాఖ జూ పార్కు, కంబాలకొండలను ప్రపంచస్థాయి ఎకో టూరిజం హబ్‌లుగా మార్చడానికి ఈ పర్యటన దోహదపడిందని ఎంపీ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఏఐటీయూసీ నాయకులకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ, అధ్యక్షులు కోట సత్తిబాబు, కార్యవర్గ సభ్యులు వైఎస్ మూర్తి, గరికన నూకరాజు, శివారెడ్డి, బోర రమణ, గంట్రెడ్డి సతీష్, సూరిబాబు, రెడ్డి అప్పలరాజు, నక్క వాసు తదితరులు ఎమ్మెల్యేను బుధవారం కలసి వినతి పత్రం అందించారు. కార్మిక సంక్షేమ బోర్డులో పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను తక్షణం పరిష్కరించేలా చూడాలని కోరారు. బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమకు హక్కుగా రావాల్సిన సంక్షేమ పథకాల కోసం పెట్టుకున్న దాదాపు 50 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకనకమహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి పాలకవర్గం ప్రమాణ స్వీకారం



కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకార చేయిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులోని శ్రీకనకమహాలక్ష్మి (దుర్గా) అమ్మవారి దేవాలయం అవరణలో బుధవారం ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణబాబు కార్యవర్గ ప్రతినిధులతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యులు భక్తులకు సంతృప్తికర సేవలు అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని దేవాలయాల్లో భక్తుల సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తోందన్నారు. ఆలయ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా గుంటుబోయిన మూర్తి యాదవ్, సభ్యులుగా పీతల నర్సింగ్‌రావు, బొట్టా సాయి, పి.దేవానంద్, టి.సాయికిరణ్, వి.పెద్దికొండ, పి.అరుణ, మమత సాహూ, ఇ.రోజా ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈవో కె.గాయత్రి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకట పట్టాభిరామ్, టీడీపీ వార్డు అధ్యక్షులు పీతల అమరేంద్ర, నేతలు పీతల అవినాష్, నక్కన వినయ్, చెల్లిబోయిన ఘన రమేష్, బైరెడ్డి పోతన్న రెడ్డి, బొట్ట రమణ, కె.శంకర్ పాల్గొన్నారు.

నేడు పెదవాల్తేరులో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సీతమ్మధార, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద వాల్తేరుసెక్షన్‌లో గురువారం సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. పెద్ద వాల్తేరు సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే సమావేశంలో వినియోగదరులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్య, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర ఇబ్బందులపై ఫిర్యాదులను తమ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అలాగే సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు. సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజాబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు వినతి



మజ్దూర్ సంఘం నేతలు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిదో వేతనసంఘాన్ని ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఐఎన్‌సీ మజ్దూర్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం విశాఖకు విచ్చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆ సంఘం నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. బీఎంఎస్ సంఘం గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, కోశాధికారి పి.సురేష్‌లు కలిసి పలు సమస్యలను ఆమెకు విన్నవించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్ల తరపున తాము ఈ లేఖ అందజేశామన్నారు. పదేళ్లకు ఒక్కసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలను సమీక్షించేందుకు వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలు ఉండేలా చూడాలన్నారు. పాత పెన్షన్ స్కీమ్ వల్ల ఉద్యోగులకు భద్రత ఉంటుందని లేఖలో స్పష్టం చేశామన్నారు. 2004లో ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ వలన ఉద్యోగుల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందని,ఈ రెండు కీలక డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆమెకు విజ్ఞప్తి చేశామన్నారు.

జీవీఎంసీలో విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఏడీసీలు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, అధికారులు, ఉద్యోగులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డిలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీలోని వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..



విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న సంఘం నాయకులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాలుగో సెక్టరులోని విశ్వకర్మ ఆలయంలో విశ్వ బ్రాహ్మణ సాంఘిక సంక్షేమ సంఘం బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించింది. విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా సంఘం ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. భగవాన్‌కు పూజ అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విశ్వబ్రాహ్మణులు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు.

హిడెన్ స్ప్రౌట్స్‌లో మోదీ జన్మదిన వేడుకలు



మానసిక దివ్యాంగులు మధ్యకేక్ చేసి ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు జరుపుతున్న దృశ్యం

పెదవాల్తేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మానసిక దివ్యాంగుల మధ్య కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సేవా భావం, సమాజ అభివృద్ధి పట్ల కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మానసిక దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయులు శంకర్ మధు, సురేష్, పద్మ, సరళ, స్వాతి, రాజు, సిబ్బంది పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పెరియార్ ఆశయాలు స్ఫూర్తిదాయకం'



పెరియార్ ఈవీ రామస్వామికి నివాళులు అర్పిస్తున్న వీవీ రమణమూర్తి, పలు సంఘాల నాయకులు

బీచ్‌రోడ్డు, సెప్టెంబర్ 17, (ఆంధ్రజ్యోతి) : నేటి యువత పెరియార్ ఈవీ రామస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి పేర్కొన్నారు. పెరియార్ ఈవీ రామస్వామి జయంతి సందర్భంగా బుధవారం ఆర్కే బీచ్ వద్ద భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచార, సంప్రదాయాలకు బద్ధ వ్యతిరేకి పెరియార్ ఈవీ రామస్వామి అన్నారు. దేశంలో 90 శాతానికి పైగా ఉన్న అణగారిన, వెనుక బడిన కులాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. భారత నాస్తిక సమాజం జాతీయ కన్వీనర్ జె.రవి మాట్లాడుతూ మహిళా స్వేచ్ఛ పట్ల పెరియార్ అభిప్రాయాలు విప్లవాత్మకమైనవని, మనం స్వేచ్ఛగా ఉండాలంటే స్త్రీలకు సమాన స్వేచ్ఛ ఇవ్వాలని ఆయన ఎన్నో పోరాటాలు చేసి హక్కులను కాపాడారని అన్నారు. అనంతరం బీచ్ రోడ్డు వద్ద ఉన్న పెరియార్ ఈవీ రామస్వామి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.పైడిరాజు, దళిత సేవా నాయకులు గణపతి, న్యాయవాది సురేష్, భారత నాస్తిక సమాజం నాయకులు వై.నూకరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి చిల్డ్రన్స్ ఎరీనాలో వివిధ అంశాల్లో శిక్షణ

సిరిపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సిరిపురంలో గల వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రతి ఆదివారం ఇక సందడిగా మారనుంది. పిల్లల సంబంధిత కార్యక్రమాలను ఈ నెల 21 నుంచి పునర్ ప్రారంభిస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. వివిధ అంశాల్లో నిపుణులైన వారితో పిల్లలకు శిక్షణ ఇప్పించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఇంగ్లీషు భాషపై ఎలా పట్టు సాధించాలనే దానిపై తర్ఫీదు ఇప్పిస్తామన్నారు. చిత్రలేఖనం, మ్యూజిక్, స్టోరీ టెల్లింగ్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్సీ, సైన్సు అంశాలు. ఇలా అనేక అంశాలపై పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కంచరపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ /ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఐటీఐ ప్రవేశాల కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 27లోగా అందజేయాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సమీపంలో గల ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకుని తగిన రసీదు పొందాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఖాళీలకు ఈ నెల 29న, ప్రైవేటు ఐటీఐలకు 30న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఏ ఐటీఐకు దరఖాస్తు చేసుకున్నారో అక్కడ జరిగే కౌన్సెలింగ్‌కు మాత్రమే హాజరు కావాల్సి ఉంటుంది. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నరవ ఐటీఐలో మూడో విడతలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.వి జయలక్ష్మి పేర్కొన్నారు.

బాలికల ఐటీఐల్లోనూ...

కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐలో మిగిలిన ఖాళీలకు నాలుగో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ.రమణారావు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 28లోపు అందజేయాలని సూచించారు. బాలికల ఐటీఐలో కోపా, డ్రస్ మేకింగ్, సివిల్, ఎలక్ట్రానిక్, మెకానిక్ తదితర ట్రేడుల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుదారులు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని రమణారావు కోరారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు ప్రకటన కర్తగా ఆనందలక్ష్మి



విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ కోచ్, నగరానికి చెందిన కె.ఆనందలక్ష్మిని నియమిస్తూ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 23 నుంచి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి ఆమె అధికారిక అనౌన్సర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఆనందలక్ష్మి నియామకంపై జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పెదవాల్తేరులో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సీతమ్మధార, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద వాల్తేరుసెక్షన్‌లో గురువారం సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఛైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. పెద్ద వాల్తేరు సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే సమావేశంలో వినియోగదరులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్య, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం. ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర ఇబ్బందులపై ఫిర్యాదులను తమ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



డాక్టరు ప్రశాంతకుమారిని సత్కరిస్తున్న డా.కె.వి.రమణ, అధ్యాపకులు

కంచరపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. ఈ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు డాక్టరు సముద్రాల ప్రశాంత కుమారికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డుతో సత్కరించింది. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాల్లో ప్రిన్సిపాల్ రమణ అధ్యక్షతన ఆమెను సత్కరించారు. ప్రశాంత కుమారి సేవలు నిరుపమానమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ డా.బి.దేముడు, వరహాలు, విభాగాధిపతులు సీహెచ్.జయప్రకాశ్ రెడ్డి, దామోదరం, విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న శాంతి సదస్సు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియన్ ఫ్రీడమ్ (ఐఏఆర్ఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రపంచ శాంతిపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎల్‌కేబీ కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్‌హాల్‌లో 'ప్రపంచ శాంతిలో యువత పాత్ర' అన్న అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఆచార్య బి.బాలమోహన్‌దాస్, ఆచార్య కె.రవి, డా.పీకే జోస్‌లు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా శాంతి ప్రతిజ్ఞ చేయిస్తామని తెలిపారు.

అమ్మవారి చెట్టు తొలగించొద్దని వినతి

సీతమ్మధార, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెం గ్రామ దేవత ఏడుగుళ్ల ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా సుమారు వందేళ్ల మర్రిచెట్టు కొమ్మలను స్వప్రయోజనం కోసం నరికివేసినవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కమిటీ ప్రతినిధులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. పండుగల వేళ భక్తులు ఈ మర్రిచెట్టుకు పూజలు చేస్తుంటారని గుర్తుచేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటరాజు రెడ్డి, ఉపాధ్యక్షుడు యేండ్రేడ్ల వెంకటేష్‌రెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తి రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు బర్ల బాలకృష్ణ, దిలీప్ తదితరులు సీతమ్మధారలో గల అర్బన్ తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఆగని రౌడీషీటర్ల ఆగడాలు

... 5వ పేజీ తరువాయి

కొందరు దందాలు, దౌర్జన్యాలు చేస్తున్నారు. సెటిల్‌మెంట్‌లలో తలదూర్చుతున్నారు. రౌడీషీటర్లు రాత్రి తొమ్మిది గంటలయ్యేసరికి ఇంటికి చేరకపోయినా, ఆ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినా...వారిపై నిఘా పెట్టిన కానిస్టేబుల్ అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. కానీ, ఇది ఎక్కడా జరగడం లేదు. దీనివల్ల రౌడీషీటర్లు అర్ధరాత్రిపూట నగరంలో విచ్చలవిడిగా తిరుగుతూ ఎదుటివారిపై దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా రౌడీషీటర్లపై సీపీ సీరియస్‌గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నగరవాసులు అంటున్నారు.

ప్రపంచ ప్రభావశీలి ప్రధాని నరేంద్రమోదీ

» జన్మదిన వేడుకల్లో నేతల వ్యాఖ్య » రక్తదానాలు, సేవా కార్యక్రమాలతో ఘనంగా సంబరాలు



ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను జగదాంబ కూడలిలో నిర్వహిస్తున్న అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు



27వ వార్డు దొండపర్తిలో నరేంద్ర మోదీ కటౌట్ వద్ద వేడుకలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు, అభిమానులు

మహారాణిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ప్రభావవంతమైన నాయకులలో ప్రధాని నరేంద్ర మోదీ ఒకరని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. జగదాంబ వద్ద ఉన్న కార్యాలయంలో ప్రధాని మోదీ 75వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ వ్యక్తిగా ప్రయాణం మొదలు పెట్టిన మోదీ దేశ అత్యున్నత పదవిని చేపట్టి ఎన్నో రికార్డులు సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పెబ్బిలి రవికుమార్, కన్వీనర్ ఎన్నేటి తాతారావు, ప్రధాన కార్యదర్శి చిత్రాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ జోసెఫ్ కళాశాలలో విద్యార్థినుల రక్తదానం

దొండపర్తి: ప్రధానమంత్రి మోదీ జన్మదిన వేడుకలు బీజేపీ జిల్లా కార్యదర్శి కారాల మహేష్ ఆధ్వర్యంలో 27వ వార్డులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జ్ ఎస్వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, గౌరవ అతిథులుగా బొండాడ నరేంద్ర ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీశ్, సత్యనారాయణ, ఈశ్వరరావు హాజరయ్యారు.

విద్యార్థినుల రక్తదానం

జ్ఞానాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఏఎస్. రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ ప్రారంభించారు. 36 మంది విద్యార్థినులు పాల్గొని రక్తదానం చేశారు. 370 మంది విద్యార్థినులకు ఉచితంగా రక్తపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.సుగంధి, కె.మాణిక్యకుమారి, సిస్టర్ మేరీ, సిస్టర్ నాన్సీ, సిస్టర్ డైనీ, వి.వి.ఎస్. మణిభూషణ్,పి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో...

మురళీనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సంబరాలు విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్తె, బీజేపీనాయకులు దీపికా శ్యామల, సునీల్ అగర్వాల్, 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్ వానప్రస్థ వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు తువ్వాళ్లు, పండ్లు అందజేశారు. పాఠశాలల్లో బాలలకు పండ్లు పంచారు. భారతీయుల సంక్షేమం కోసం అకుంఠిత దీక్షతో పనిచేస్తున్న నేత పుట్టినరోజు ప్రజలందరికీ పండుగ రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో 48, 49, 50, 51 వార్డుల కూటమి పార్టీల నాయకులు హాజరయ్యారు. కంచరపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను జీవీఎంసీ 47వ వార్డులో ఘనంగా నిర్వహించారు. రాంజీ ఎస్టేట్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక హాజరై కేకు కట్ చేశారు. అనంతరం విద్యార్థులు, వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు ఆర్.రాంబాబు, జి.అరుణ్ బాబు, అరుణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో పండ్లు అందజేస్తున్న సునీల్ అగర్వాల్, దీపికా శ్యామల తదితరులు

ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు వినతి



మజ్దూర్ సంఘం ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఐఎన్‌సీ మజ్దూర్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం విశాఖకు విచ్చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆ సంఘం నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. బీఎంఎస్ సంఘం గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, కోశాధికారి పి.సురేష్‌లు కలిసి పలు సమస్యలను ఆమెకు విన్నవించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్ల తరఫున తాము ఈ లేఖ అందజేశామన్నారు. పదేళ్లకు ఒక్కసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలను సమీక్షించేందుకు వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలు ఉండేలా చూడాలన్నారు. పాత పెన్షన్ స్కీమ్ వల్ల ఉద్యోగులకు భద్రత ఉంటుందని లేఖలో స్పష్టం చేశామన్నారు. 2004లో ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ వలన ఉద్యోగుల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందని, ఈ రెండు కీలక డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆమెకు విజ్ఞప్తి చేశామన్నారు.

'జానపద కళలు జాతి సంపద'



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి రామకృష్ణ

సీతంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో 'జానపద గేయాలు-సామాజికాంశాలు' అనే అంశంపై కవి, గాయకుడు రెడ్డి రామకృష్ణ ప్రసంగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జానపద గేయాలలో ఆర్థిక, సామాజిక అంశాలు అనేకం ఉన్నాయని, స్త్రీ, పురుష సంబంధాలు, ముఖ్యంగా ఆస్తుల విషయంలో ఒకనాటి సమాజం ఎలా ఉండేదో రెడ్డి రామకృష్ణ వివరించారు. సామాజిక సంబంధాలు ముఖ్యంగా కులవ్యవస్థ గురించి నిరసనలు కూడా ఉన్నాయన్నారు. అద్భుతమైన సాహిత్య విలువలతో జానపద గేయాలు, జానపద సాహిత్యాన్ని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. జానపద సాహిత్యం, కళలు జాతి సంపదన్నారు. వాటిని రక్షించుకుని, భవిష్యత్‌తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామీణ చరిత్రను తెలుసుకునేందుకు జానపద సాహిత్యం ఉపయోగపడుతుందని తెలియజేశారు. సీహెచ్ చిన సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, భాగవతుల సత్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, ఎం.పరమేశ్వరరావు, రాంపిళ్ల శివాజీ, గుంటూరు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కంచరపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ /ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఐటీఐ ప్రవేశాల కన్వీనర్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తులను ఈ నెల 27లోగా అందజేయాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సమీపంలో గల ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకుని తగిన రసీదు పొందాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఖాళీలకు ఈ నెల 29న, ప్రైవేటు ఐటీఐలకు 30న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఏ ఐటీఐకు దరఖాస్తు చేసుకున్నారో అక్కడ జరిగే కౌన్సెలింగ్‌కు మాత్రమే హాజరు కావాల్సి ఉంటుంది. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నరవ ఐటీఐలో మూడో విడతలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి పేర్కొన్నారు.

బాలికల ఐటీఐల్లోనూ...

కంచరపాలెం ప్రభుత్వ బాలికల ఐటీఐలో మిగిలిన ఖాళీలకు నాలుగో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జీవీ.రమణారావు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను 28లోపు అందజేయాలని సూచించారు. బాలికల ఐటీఐలో కోపా, డ్రస్ మేకింగ్, సివిల్, ఎలక్ట్రానిక్, మెకానిక్ తదితర ట్రేడుల్లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుదారులు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని రమణారావు కోరారు.

స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వార్డు నాయకులు

మాధవధార, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం 51వ వార్డులో బుధవారం స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యాలయం ప్రారంభమైంది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజులు కలిసి నవీకరించిన పాత మీసేవ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ జేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర పి-4 కార్యక్రమం ప్రజలందరికీ మేలు కలిగించేలా అమలవుతుందన్నారు. పేదలకు సాయం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జెడ్సీ బి.రాము, టీడీపీ నాయకులు కీర్తి, ఎస్.వరప్రసాద్, జనసేన నాయకుడు జి.అప్పారావు, బీజేపీ నాయకులు హాజరయ్యారు.

సమస్యలు పార్టీ కార్యాలయంలో తెలపండి: ఎమ్మెల్యే

సీతమ్మధార, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈ నెల 28 వరకు జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్నందున ప్రజలు సమస్యలను బీజేపీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సూచించారు. సీతమ్మధారలో గల బీజేపీ కార్యాలయంలో గురువారం నుంచి అందుబాటులో ఉండనని పేర్కొన్నారు.

ఉత్సాహంగా వారధి జిల్లా పోటీలు



విజేత బాలికలతో అతిథులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు వారధి జిల్లా స్థాయి వ్యాసరచన, వకృత్వ పోటీలు బుధవారం ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ప్రతీ మండలంలో ప్రథమ స్థానం సాధించిన మొత్తం 22 బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వకృత్వ పోటీలో నడుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సుహానిగీతిక, గులషన్ ఫిర్దోస్, ఉజ్వల గెలుపొందారు. గైడ్ టీచర్‌గా ఎన్ఆర్ఆర్ఎస్ నరసింహం వ్యవహరించారు. వ్యాసరచనలో గాజువాక ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీవల్లి, తనూజా, సాయి పూజిత గెలుపొందారు. గైడ్ టీచర్‌గా నిర్మల వ్యవహరించారు. ఈ విజేతలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్, జిల్లా సౌన్ అధికారి పి.రాజారావు, ఏఎంఓ జి.లక్ష్మి, జి.శ్రీదేవి, పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారి పాల్గొన్నారు.

2 వరకు స్వచ్ఛత హీ సేవా ప్రచారం



సిబ్బందితో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వాల్తేరు డివిజన్‌లో స్వచ్ఛత హీ సేవా ప్రచార కార్యక్రమాలను బుధవారం ప్రారంభించారు. దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. జీఎం కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం, స్థిరమైన పద్ధతులపై ప్రతి ఒక్కరూ నిబద్ధత కనబరచాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అక్టోబరు 2 వరకు జరిగే స్వచ్ఛత హీ సేవా ప్రచార కార్యక్రమం ద్వారా రైల్వే సిబ్బంది, ఎన్జీవోలు, సామాజిక బృందాలు, పౌరులు సంయుక్తంగా భాగస్వామ్యం కావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యమే ప్రధాన లక్ష్యాలుగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ కోస్ట్ రైల్వే ఓఎస్డీ బి.చంద్రశేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ఎం ఆధ్వర్యంలో...

డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో ప్రారంభించిన స్వచ్ఛత కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా హాజరై పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ప్రణాళికతో స్వచ్ఛత హీ సేవా ప్రచార కార్యక్రమాలు వాల్తేరు డివిజన్ వ్యాప్తంగా జరుగుతాయని తెలిపారు. అవగాహన, పరిశుభ్రత డ్రైవ్‌లు నిర్వహించి ఆరోగ్య శిబిరాలు, మారథాన్, క్రీడా కార్యక్రమాలు, మొక్కల పెంపకం, అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైల్వే పరిసర ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, రైళ్లు, పాంట్రీకార్‌లో పరిశుభ్రత డ్రైవ్‌లు చేపడతామన్నారు. ర్యాలీలు, వీధి నాటకాల ప్రదర్శన, స్వచ్ఛతపై వివిధ రకాల పోటీలు నిర్వహించి, అక్టోబరు 2న స్వచ్ఛతా దివస్ కార్యక్రమాన్ని చేపడతామని వివరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారాం, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బార్‌లకు ఆదరణ నిల్

... 5వ పేజీ తరువాయి

ఇటీవల రెండోసారి నోటిఫికేషన్ జారీచేయగా కేవలం 11 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి. దీంతో మరో 52 బార్‌లు కేటాయింపునకు నోచుకోని పరిస్థితి ఏర్పడింది. నాలుగేసి దరఖాస్తులు వచ్చిన 11 బార్లను కేటాయించేందుకు గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో లాటరీ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒకరకంగా చెప్పాలంటే విశాఖ జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు బార్‌లకు దరఖాస్తులు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందువల్లే రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో కంటే విశాఖ జిల్లాలో అత్యధికంగా బార్‌ల కేటాయింపు జరిగింది.

ఇద్దరు వైద్య విద్యార్థుల బలవన్మరణం

... 5వ పేజీ తరువాయి

చెందిన చింతల దేవుడు, గౌరి దంపతుల కుమార్తె శివాని జ్యోత్స్న (21) శివారు ప్రాంతంలో గల కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రథమ సంవత్సరంలో బ్యాగ్‌లాగ్స్ ఉండిపోయాయి. వాటిని క్లియర్ చేయడంలో భాగంగా చదువుకునేందుకు ఈనెల 15న సుజాతనగర్‌లోని ఓ అపార్టుమెంటులో నివసిస్తున్న తన మేనమామ ఇంటికి వచ్చింది. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ముభావంగానే ఉండేది. బ్యాక్‌ల్యాగ్స్ గురించి ఆలోచిస్తూ తీవ్ర ఒత్తిడితో ఆందోళన చెందుతుండేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఏడు గంటలకు చదువుకుంటానంటూ అపార్టుమెంట్ టెర్రస్ ఎక్కింది. కొంతసేపటి తరువాత టెర్రస్ మీద నుంచి కిందకు దూకేసింది. అకస్మత్తుగా పెద్ద శబ్దం రావడంతో సెల్లార్‌లో వాకింగ్ చేస్తున్నవారు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే పెందుర్తి సీహెచ్‌సీకి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాల్లో ఉత్సాహం

... 5వ పేజీ తరువాయి

వర్తిస్తుందన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తరువాత రోజు నుంచే వాటిని అమలు చేసేందుకు అనేక సంస్థలు ముందుకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. సిమెంట్ పరిశ్రమకు చెందిన ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ సిమెంట్‌ను 28 నుంచి 18 శాతం స్లాబ్‌కు మార్చడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు సంబంధించిన సాంకేతిక ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆరోగ్య రంగానికి చెందిన ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ వ్యక్తిగత ఇన్సూరెన్స్‌లకు సంబంధించి స్లాబ్‌లను జీరో చేశారని, గ్రూపు పాలసీలకు సంబంధించి కూడా ఇదే తరహా నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు.

మహిళా భద్రతలో విశాఖ టాప్

... 5వ పేజీ తరువాయి

గ్లోబల్ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం ప్రజలు చాలా మంచివారని, మహిళా పారిశ్రామికవేత్తలు కూడా ఇక్కడ ఉన్నారని, వారు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి వచ్చే నెలలోనే గూగుల్ విశాఖపట్నం వస్తుందని ప్రకటించారు. అదేవిధంగా భోగాపురంలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం వచ్చే వచ్చే ఏడాది ఆగస్టు నుంచి ఆపరేషన్లు ప్రారంభిస్తుందన్నారు. విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు జీఎంఆర్‌ను, ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అనుసంధానం చేశామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల తయారీలో అది కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. విశాఖపట్నానికి మెట్రో రైలును తీసుకురావడానికి కృషిచేస్తున్నామని చెప్పారు.

తప్పులతడకలుగా స్మార్ట్ రైస్‌కార్డులు

... 5వ పేజీ తరువాయి

పంపిణీలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డిపోలకు వెళ్లి వాకబు చేసినా అక్కడ లేవని సమాధానం వస్తోంది. కార్డుదారుల వివరాలకు అతని ఫోన్ నంబర్ లింకేజీ ఆప్షన్ లేకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా వీధుల్లో కార్డుదారులకు సరుకులిచ్చారు. ఈ క్రమంలో డిపోలకు, కార్డుదారులకు మధ్య సంబంధాలు తెగిపోయాయి. దీంతో లబ్ధిదారుల చిరునామాల మార్పుపై అప్‌డేట్ లేదు. జగన్ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థలో పనిచేసిన తాత్కాలిక సిబ్బంది ఇష్టారీతిన కార్డుదారుల చిరునామాలను మ్యాపింగ్ చేశారు. ఎక్కడో నివాసం ఉంటున్న వారిని స్థానిక సచివాలయానికి మ్యాపింగ్ చేసి వదిలేయడంతో తాజాగా జారీ అయిన స్మార్ట్ రేషన్ కార్డులు పాత చిరునామాలకే చేరాయి. అంటే నిత్యం రేషన్ తీసుకుంటున్న డిపో ఒకటైతే, కార్డు సచివాలయ మ్యాపింగ్ ఆధారంగా వేరే డిపోకు కార్డులు వెళ్లిపోయాయి. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారి విషయంలోనూ ఇదే జరిగింది. కార్డులు వచ్చిన రోజు నుంచి రేషన్ లబ్ధిదారులు సచివాలయాలు, రేషన్ డిపోల చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఆన్‌లైన్‌లో కార్డు ఏ డిపోలో ఉందో తెలుసుకునే అవకాశం ఉన్నా కొందరు డీలర్లు ఆ పనిచేయడం లేదనే వాదన ఉంది. ఇదిలావుండగా కొంతమంది రేషన్ డీలర్లు...కార్డుల కోసం డిపోలకు వెళ్లినవారి వేలిముద్ర తీసుకుని బియ్యం బదులు డబ్బు ఇస్తున్నారు. కొత్త కార్డు ఎక్కడుదంటే..మా దగ్గర లేదు...ఎక్కడుందో తెలుసుకోవాలంటే తరువాత రండి అని పంపిస్తున్నారు. ప్రధానంగా వన్‌టౌన్ ఏరియాలో స్మార్ట్ కార్డుల కోసం డీలర్లు పూర్తిగా సహకరించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ విస్తరణ?

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయని సీఎం వద్ద పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రస్తావించారు. ప్రధానంగా పెందుర్తి మండలం దాదాపు జీవీఎంసీలో ఉంటుందని చెబుతూ గ్రామీణ ప్రాంతంగా ఉన్న పంచాయతీలను కూడా నగర పాలక సంస్థలో విలీనం చేయాలని కోరారు. ఆనందపురం, భీమిలి రూరల్, పద్మనాభం మండలాలను కూడా జీవీఎంసీలో విలీనం చేస్తే జిల్లా మొత్తం ఒక నగర పాలక సంస్థ పరిధిలోకి వస్తుందని, ఇదే విషయం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గతంలో ప్రస్తావించారని పేర్కొన్నారు. అందుకు ముఖ్యమంత్రి స్పందిస్తూ పెందుర్తి ఎమ్మెల్యే ప్రతిపాదనను పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. అలాగే 11 మండలాలున్న జిల్లా పరిధిని కొంతమేర విస్తరించాలని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ప్రస్తావిస్తూ ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖలో విలీనం చేయాలని అక్కడ ప్రజలు కోరుతున్నారని వివరించారు. ఈ దశలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీలో ఉన్న లక్షల మంది ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా మౌలిక వసతులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జీవీఎంసీని విస్తరిస్తే మంచిదేనని, అప్పుడు జిల్లా మొత్తం నగర పాలక సంస్థ పరిధిలో ఉంటుందన్నారు. పద్మనాభం ఒక్కటే నగరానికి దూరంగా ఉన్నందున ఆ ఒక్క మండలాన్ని గ్రామీణ ప్రాంతంగా ఉంచలేమన్నారు. కాగా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి జిల్లాలోని నాలుగు మండలాలను జీవీఎంసీలో విలీనం చేయకపోతే మరోసారి జడ్పీ ఎన్నికలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా జరిగే అవకాశం ఉందని పంచకర్ల సందేహం వ్యక్తంచేశారు. ఇదిలావుండగా నగరంలో కార్యక్రమాలు పూర్తయిన అనంతరం విమానాశ్రయానికి చంద్రబాబునాయుడుతో పాటు వాహనంలో పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, మరొకరు వెళ్లారు. ఈ సందర్భంగా నగరంలో పాలన, ప్రజారోగ్యం, వీధి లైట్లు, తాగునీరు, రోడ్ల నిర్వహణ ప్రధానంగా గుంతలు పూడ్చడం గురించి కలెక్టర్‌ను అడిగి సీఎం తెలుసుకున్నారు. రోజువారీ పారిశుధ్యం బాగా లేకపోయినా, చెత్త తరలింపులో జాప్యం కనిపించినా ప్రజల నుంచి అసంతృప్తి వస్తుందని స్పష్టంచేశారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. వీధి లైట్లు నిర్వహణ, తాగునీటి సరఫరాపై రోజువారీ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని అంశాలను పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించారు. తాజా బదిలీల్లో నగరం నుంచి ఒక డీసీపీని బదిలీ చేసినా ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదని మరో ఏడీసీపీ, ఐదు ఏసీపీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నగరానికి కనీసం ఇద్దరు ఐపీఎస్ అధికారులను కేటాయించాలని, మిగిలిన అధికారుల ఖాళీలను భర్తీచేయాలని కోరగా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఉక్కునగరంలో మూసివేసిన విశాఖ విమల విద్యాలయాన్ని తిరిగి తెరిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకుగాను అక్కడ పనిచేసే ఉపాధ్యాయులను గ్రాంటు ఇన్‌ఎయిడ్ ద్వారా జీతాలు ఇవ్వాలని కోరగా సీఎం పరిశీలిస్తామన్నారు. సుమారు 1,600 మంది విద్యార్థులున్న పాఠశాలను ప్రభుత్వం తీసుకోవాలనే ప్రతిపాదనను పరిశీలిస్తానన్నారు. కాగా ఈ పర్యాయం వచ్చినప్పుడు నగర కేడర్‌తో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుంటానని పల్లాకు చంద్రబాబు హామీ ఇచ్చారు. కేడర్‌ను ఎప్పటికప్పుడు కలిసి వారి సమస్యలు తెలుసుకోవాల్సి ఉందని, కష్టకాలంలో ఉన్నప్పుడు అనేక కష్టనష్టాలకు ఓర్చి పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.



శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీవారికి లక్ష తులసి పూజ

అగనంపూడి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో గల శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం లక్ష తులసీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు జరిపారు. నిత్యం హోమంతో పాటు పూర్ణాహుతిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, కమిటీ ప్రతినిధి ఎం.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గొరపల్లిలో 'పొలం పిలుస్తోంది'

పెందుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపల్లిలో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు మాణిక్యమాంబ వ్యవసాయ మడుల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నానో యూరియా వినియోగం గురించి రైతులకు వివరించారు. నానో యూరియా వాడకంతో ఎటువంటి నష్టం లేకుండా పంట మొత్తం ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా వరికి సుడి దోమపోటు ఉన్నట్టు గుర్తించారు. దీని నివారణకు ఎకరాకు ఎసిఫేట్ 300 గ్రాముల మందును 20 లీటర్ల నీటిలో కలిపి వరిదుబ్బు మొత్తం తడిసేలా పిచికారి చేయాలని వ్యవసాయాధికారిణి చంద్రావతి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు వడ్డాది కృష్ణ పాల్గొన్నారు.

శ్రమించే కార్మికులకు గుర్తింపు



అప్పారావును సత్కరిస్తున్న కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రమించే కార్మికులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.అప్పలరాజు అన్నారు. స్టీల్ ప్లాంటులో విశేష సేవలందిస్తున్న ఉద్యోగి రొంగలి అప్పారావును బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రగతి కోసం అప్పారావు చేసిన సేవలు ప్రశంసనీయమైనవన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్మిక నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, అమర్‌సింగ్, శ్రీనివాసరావు, కొమ్ము ప్రసాద్, పిన్నయ్య దొర, తదితరులు పాల్గొన్నారు

అన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింహాద్రినాథుని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన భూపతిరాజు విశ్వనాథరాజు, శ్రీలక్ష్మి దంపతులు బుధవారం రూ.1,00,116 విరాళాన్ని ఏఈవో వి.రమణమూర్తికి అందజేశారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కిందపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 22, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280



87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లోని పార్కుల్లో తవ్విన ఇంకుడు గుంతల్లో పుష్కలంగా ఉన్న నీరు

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టారు..

- తిరుమల నగర్ కాలనీలోని పార్కుల్లో నిండుకుండల్లా మారిన ఇంకుడు గుంతలు
- భూగర్భ జలాలను పెంచి భవిష్యత్తు తరాలకు అందిస్తామని ప్రతిజ్ఞ చేసిన కాలనీ వాసులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో నీటి కొరతను అధిగమించేదుకు గ్రేటర్ అధికారుల సూచనలతో, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల సహకారంతో పార్కులకు నలువైపులా తవ్విన ఇంకుడు గుంతల్లో నీరు చేరింది. గుంతల్లో చేరిన నీరు చేరడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని.. తమ ప్రయత్నం సఫలీకృతమైందని కాలనీ వాసులు ఆనందనం వ్యక్తం చేస్తున్నారు.

నీటి కొరత నేర్పిన పాఠంతో..

2019లో కాలనీలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరింగుల నుంచి కూడా చుక్కనీరు కూడా వచ్చేది కాదు. దీంతో కాలనీ వాసుల్లో ఆందోళన మొదలైంది. తప్పనిసరి పరిస్థితుల్లో రోజూ కార్పొరేషన్, ప్రైవేటు ట్యాంకుల ద్వారా నీళ్లు తెప్పించుకుని వినియోగించుకునేవారు. అప్పట్లోనే జీవీఎంసీ అధికారుల సూచన మేరకు ఇతర ప్రాంతాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగినట్టు సంఘం ప్రతినిధులు తెలుసుకున్నారు. దీంతో తమ కాలనీలో కూడా ఇంకుడు గుంతలకు శ్రీకారం చుట్టారు.

తోటి కాలనీలకు ఆదర్శంగా

తిరుమల నగర్ కాలనీలోని ఇళ్లల్లో మొత్తం 120, రహదారుల పక్కన 42, పార్కుల్లో 20 ఇంకుడు గుంతలన తవ్వించి వర్షపు నీటిని ఆదా చేశారు. అంతేకాక కాలనీలోని సుమారు నాలుగు వేల మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. దీంతో పలు అవార్డులను కాలనీ సొంతం చేసుకుంది. తిరుమల నగర్‌కాలనీ తోటి కాలనీలకు ఆదర్శంగా నిలిచింది.

భవిష్యత్తు తరాలకు నీటిని అందిద్దాం

ప్రతి నీటి బొట్టును రక్షించి భావితరాలకు అందిద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్‌లో ఇటీవల ఆయన పర్యటించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. 'వర్షపు నీరును ఇంకుడు గుంతల ద్వారా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుదాం' అని కాలనీ వాసులకు ఆయన సూచించారు. అనంతరం కాలనీ వాసులతో నీటిని పరిరక్షిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు.

భూగర్భ జలాలను పెంచేందుకే ఈ ప్రయత్నం



నీరే ప్రాణదారమని, ఇళ్లలో వినియోగించే నీరు వృథా కాకుండా భూగర్భంలోకి చేరేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులకు అవగాహన కల్పించాను. దీంతో ఇళ్లలోని, పార్కుల్లో, రహదారు పక్కన గుంతలు తవ్వారు. దీంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ 2020లో నాకు 'వాటర్ హీరో' అవార్డును అందించింది. ఇప్పుడు మా కాలనీ ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచేలా ఉండడం ఎంతో ఆనందంగా ఉంది.

-ఎం.పరమానందం,
వాటర్ మెరిట్ అవార్డు గ్రహీత, తిరుమల నగర్



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దల్లి గోవిందరాజు, కరణంరెడ్డి నరసింగరావు



కార్మికులకు స్వీట్లు, పాదరక్షలు పంపిణీ చేస్తున్న దేనంకొండ కృష్ణంరాజు, పావని

ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

గాజువాక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పాత గాజువాకలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత్ బలమైన శక్తిగా అవతరించిందని, ఇదంతా మోదీ కృషి వల్లే సాధ్యపడిందన్నారు.

దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో మోదీ ఆదర్శ నేతగా నిలిచారని పేర్కొన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ ఆనందంగా ఉండాలనే సంకల్పంతో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం పలువురు రోగులకు వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంధం వెంకటరావు, గడసాల అప్పారావు, దీనంకొండ కృష్ణంరాజు, లక్కరాజు సోంబాబు, గూటూరు శంకరరావు,శ్రీనివాస్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో..

పెదగంట్యాడ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఇక్కడి భవిత కేంద్రం ఆవరణలో దివ్యాంగ చిన్నారులతో బీజేపీ 76వ వార్డు అధ్యక్షుడు జీలకర్ర రమణ కేక కట్ చేయించారు. ముఖ్యఅతిథిగా హాజరైన 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ దివ్యాంగుల చిన్నారుల మధ్య ప్రధాని జన్మదిన వేడుకలను జరపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పైడి హేమలత మాట్లాడుతూ దివ్యాంగుల్లోని న్యూనతా భావాన్ని తొలగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జీలకర్ర భువనేశ్వరీదేవి, న్యూపోర్టు ఎస్ఐ అప్పలరాజు, భవిత కేంద్రం నిర్వాహకులు భారతి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్ శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో పీఎం మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పేరిట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షురాలు పావని ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టి సామాజిక భవనం వద్ద పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్రం చేశారు. అలాగే 70 మంది పారిశుధ్య కార్మికులకు గుడ్లు, పాలు, పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేనంకొండ కృష్ణంరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి లక్కరాజు సోంబాబులు మాట్లాడుతూ ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బాటా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సింధియా న్యూ కాలనీలో..

సింధియా: గ్రేటర్ 40వ వార్డు పరిధి సింధియా న్యూ కాలనీలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాశ్ మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. అనంతరం ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను, సిబ్బందికి పువ్వుల మొక్కలను పంపిణీ చేశారు.

సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయంలో 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



సాగరగిరి కనకదుర్గమ్మ

మల్కాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యారాడ సముద్ర తీరంలో కొలువుదీరిన శ్రీసాగరగిరి కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా 22న సాగరగిరి కనకదుర్గమ్మ బాలదుర్గాదేవి అవతారంలో, 23న గాయత్రిదేవిగా, 24న రాజేరాజేశ్వరి దేవిగా, 25న లలితాదేవిగా, 26న లక్ష్మిదేవిగా, 27న భువనేశ్వరీదేవిగా, 28న అన్నపూర్ణాదేవిగా, 29న సరస్వతీదేవిగా, 30న చండీదేవిగా, అక్టోబరు 1న శాకంబరీగా, 2న విజయదశమిని పురస్కరించుకుని కనకదుర్గా దేవిగా భక్తులకు దర్శనమిస్తారు. విజయదశమి పర్వదినాన అమ్మవారి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరిరాట

గాజువాక: శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు 72వ వార్డు పరిధి పాతకర్నవానిపాలెంలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో పందిరిరాట వేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల నాలుగు వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కరణం కనకారావు, వరలక్ష్మి, సిరసపల్లి అప్పారావు, కరణంరెడ్డి నరసింగరావు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తుంగ్లాం కాలనీలో..

అక్కిరెడ్డిపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తుంగ్లాం కాలనీలోని దుర్గాదేవి ఆలయం వద్ద పందిరిరాట వేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కాలనీ నాయకులు కొల్లి అప్పలరెడ్డి దంపతులు పందిరిరాటను ప్రతిష్ఠించారు. పలువురు కాలనీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా అభియాన్

పెందుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ ఆవరణలో గల మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రపరచడంతో పాటు పరిసర ప్రాంతంలోని చెత్తాచెదారాన్ని ఏరివేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సియ్యాద్రి బాల, ముదపాక శివ, తదితరులు పాల్గొన్నారు,

40వ వార్డులో 'స్వస్థ్ నారీ సశక్త్' కార్యక్రమం

సింధియా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నోడల్ ఆఫీసర్ డాక్టర్ హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా అక్టోబరు 2 వరకు పలుచోట్ల వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్ రూఫ్‌టాప్ కోసం ఈఈ నాయుడుకు చెక్కు అందజేస్తున్న లబ్ధిదారుడు

'సూర్య ఘర్'తో విద్యుత్ ఆదా

ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు

ఆటోనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు ప్రజలందరూ తప్పనిసరిగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో చేరి సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు కోరారు. గురువారం 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో రూఫ్‌టాప్‌పై సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలని ఆయనతో పాటు ఏడీసీ ఎ.పార్థసారథి, ఏఈ రామకృష్ణలు ఇంటింటికీ వెళ్లి సూర్య ఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు కరెంటు బిల్లులను తగ్గించడమే కాకుండా ఇంధన రంగంలో భారత్ స్వావలంబన దిశగా పయనించేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. లబ్ధిదారులకు సబ్సిడీని కూడా కేంద్రం అందజేస్తుందన్నారు. పెట్టుబడుల కోసం ఎటువంటి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణ సదుపాయాన్ని కూడా కేంద్రమే కల్పిస్తుందని, అందువల్ల ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు, నాయకులు బొడ్డేడ రమణ, వేగి పాపారావు, కృష్ణ, పీబీఎల్ మూర్తి, పీఎంఎల్ నాయుడు, రాజా, విద్యుత్ శాఖ సిబ్బంది, అధిక సంఖ్యలో వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గోపాలపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్నందున గోపాలపట్నం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా గోపాలపట్నం బంక్, నరసింహనగర్, రామకృష్ణ నగర్, శ్రీనివాస నగర్, గణేశ్ నగర్, ఇందిరా నగర్, లక్ష్మీ నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ పరిధి రాంపురం 33/11 కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. ఈ కారణంగా గొరపల్లి, గంగమ్మపేట, గొల్లలపాలెం, కొట్నివానిపాలెం, కరకవానిపాలెం, సంతపాలెం, ఎస్ఎస్ఆర్ లేఅవుట్, ఎంజీఎం లేవుట్, ఆర్కే లేఅవుట్, వెల్ఫేర్ కాలేజీ, హర్షవర్ధన్‌నగర్, సాయిరాం లేఅవుట్, సాధూ మఠం, బాపూజీనగర్, ఏకలవ్య కాలనీ, లొయోలా, అంబికా గొడౌన్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.



విశ్వకర్మ పూజకు కలశంతో వెళ్తున్న ఉక్కు జీఎం డాక్టర్ సారంగి, తదితరులు

పలుచోట్ల ఘనంగా విశ్వకర్మ జయంతి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ పూజను బుధవారం స్టీల్ ప్లాంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్లాంట్ జీఎం (మెడికల్) డాక్టర్ జేఎస్ సారంగి మాట్లాడుతూ ఏటా ఇక్కడ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని పూజలు చేయడం అభినందనీయమన్నారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో ఉత్సవాలు జరపడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: నెల్లిముక్కు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. టీడపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, స్టీల్ ప్లాంట్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీముసిరి శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు గొందేశి అప్పలరెడ్డిలు విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కణితి అప్పలరాజు, ఎం.శ్రీరామమూర్తి, డి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: విశ్వకర్మ జయంతిని గోపాలపట్నం, కొత్తపాలెం, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదర్శనగర్‌లో శ్రీవిరాట్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన విశ్వకర్మ పూజల్లో జనసేన పార్టీ నేత బెహరా భాస్కరరావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: పంచభూతాలను, పంచమూర్తులను సృష్టించినవాడు విశ్వకర్మ అని కణితి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పేర్కొన్నారు. 87వ వార్డు కణితిలో విశ్వకర్మ జయం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పురాణాల్లో విశ్వకర్మ గొప్పతనం గురించి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రగడ శ్రీనివాస్, బి.గోవింద్, ఎం.దామోదర్, డి.దానప్పలు, బొండా గోవిందరాజులు, డి.సత్తిబాబు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బెల్ హెచ్‌పీవీపీ విశ్వకర్మ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ కల్యాణ మండపంలో విశ్వకర్త జయంతిని నిర్వహించారు. ప్రత్యేక వేదికపై ప్రతిష్ఠించిన విశ్వకర్మ విగ్రహానికి గిడిజా సత్యనారాయణ, బాలభాస్కరమ్మ దంపతులు ప్రథమ పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో బెల్ ఈడీ జి.సుబ్రమణ్యం, జీఎం గౌరీశంకర్, అసోసియేషన్ నాయకులు కర్రి ప్రకాశరావు, పీఎస్ మూర్తి, ఎం.ప్రసాద్, బి.సన్యాసిరావు, కె.ముత్యాలనాయుడు, జి.వెంకటరమణ, జి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతలఅగ్రహారం సమీప లక్ష్మీపురం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడాం వద్ద గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు దాడి వరలక్ష్మీ అర్జునరావు, వైసీపీ వార్డు అధ్యక్షుడు రాపర్తి మాధవరావు, నాయకులు కాళ్ల దేవీ వెంకట గంగాధరరావు, బి.జగదప్పారావు, బి.హేమంతకుమార్, నాగార్జున, జతిన్, సాయిరాం పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 21న ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేపడుతున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వేపగుంట: జీవీఎంసీ 93, 94 వార్డుల్లో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా నాయుడుతోట బంటాకాలనీలో విరాట్ విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేశారు. అలాగే విశ్వకర్మ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సాయిమాధవనగర్, వేపగుంట కూడలిలో ప్రత్యేకంగా ఫొటోలను ఏర్పాటు జరిపి ప్రసాద వితరణ చేపట్టారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఉక్కు బీఎంఎస్ నాయకులు



నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ విచ్చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను స్టీల్ ప్లాంట్ బీఎంఎస్ నాయకులు బుధవారం నగరంలో కలిశారు. ప్లాంటుకు ఆర్థిక సహాయంగా రూ.11,440 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్లాంట్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించేలా చూడాలని, ప్రతినెలా సకాలంలో జీతాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఎం.రామస్వామి, జెర్రిపోతుల రమణ, ఓ.హనుమంతురావు ఉన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు


టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు

మల్కాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని టీఎన్‌టీయూసా జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు అన్నారు. టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్‌కు నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా, 58వ వార్డు ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీనివాస్‌కు మార్కెటింగ్ విభాగం డైరెక్టర్‌గా, 60వ వార్డు తెలుగు మహిళ నాయకురాలు సలీమాకు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవులను ప్రభుత్వం కల్పించిన నేపథ్యంలో వీరిని బుధవారం రామకృష్ణాపురం ఎన్టీఆర్ విగ్రహం వద్ద లక్ష్మణరావు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి హరిబాబు, రాంబాబు, కుమార్, కె.ఆదినారాయణ(ఆది), పి.భూలోకరాజు (భూలోక), తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ పంపిణీ

అగనంపూడి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ ఆధ్వర్యంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో బుధవారం గర్భిణులకు ప్రొటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వి.శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని, తమ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలను అధికంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, నిర్మల్, ప్రభాకర్, శేషగిరిరావు, సత్యనారాయణ, దేవీకిరణ్, పి.నూకరాజు, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవాలి



ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల విషయంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవాలని ఉక్కు నిర్వాసిత నాయకులు కోరారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాన్ని బుధవారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులు నేడు దుర్భర జీవనాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తీసుకువచ్చి ప్లాంటులో పనులు చేయిస్తుండడం దారుణమన్నారు. ఉక్కు యాజమాన్యం దిగొచ్చే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కె.వంశీకృష్ణ, పితాని భాస్కరరావు, మంత్రి రవి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ముఖ్యమంత్రి

- వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న చంద్రబాబునాయుడు
- హాజరైన కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం నగరంలో బిజీబిజీగా గడిపారు. ఉదయం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన స్వస్త్ నారీ- సశక్తి పరివార్ అభియాన్‌లో పాల్గొన్నారు. అనంతరం సాగరిక ఫంక్షన్ హాల్‌లో వైద్య పరీక్షల స్టాల్స్‌ను పరిశీలించారు. సాయంత్రం రాడిసన్ బ్లూ హోటల్‌లో జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జీఎస్టీ సదస్సుకు హాజరై వ్యాపారవేత్తల సందేహాలకు సమాధానమిచ్చారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి సత్యకుమార్



స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌లో సంతకం చేస్తున్న సీఎం, ఏయూ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన వారు


కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పల్లా, ప్రజాప్రతినిధులు, అధికారులు


స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం


జీసీసీ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌కు హాజరైన పారిశ్రామికవేత్తలు


కేంద్ర మంత్రితో చర్చిస్తున్న రాష్ట్ర మంత్రి పయ్యావుల

విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, సీపీ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు

గోపాలపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విశాఖ విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. ఉదయం 11.16 గంటలకు హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పి.గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్, జీసీసీ ఎండీ కల్పనా కుమారి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్య సేవ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి బయలుదేరి వెళ్లారు.

ఆత్మీయ వీడ్కోలు

నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నేతలు, అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి 8.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబుకు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. సీఎం వెంట ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు.

కేంద్ర ఆర్థిక మంత్రికి వీడ్కోలు

నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు నగర బీజేపీ నేతలు విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి 7 గంటలకు రోడ్డుమార్గంలో విమానాశ్రయానికి చేరుకున్న నిర్మలా సీతారామన్ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

పాలనలో ఇబ్బందులపై దృష్టి సారించండి

- ముఖ్యమంత్రికి కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో వినతి

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల పాలనలో సహకరించేందుకు గత ప్రభుత్వం అడ్మినిస్ట్రేటర్స్‌ను నియమించిందని, దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రాన్ని సమర్పించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో పాలనతో పాటు రోగులకు అందించే వైద్య సేవలపైనా ప్రభావం పడుతోందన్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సీఎస్ఆర్ఎంవో

క్రీడా మైదానాలను సిద్ధం చేయండి

అధికారులకు ఏయూ వీసీ రాజశేఖర్ ఆదేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు వీలుగా సింథటిక్ క్రీడా మైదానం, ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏయూ ఉప కులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. వర్సిటీ వార్షిక స్పోర్ట్స్ బోర్డు సమావేశాన్ని బుధవారం పరిపాలన విభాగం ఎగ్జిక్యూటివ్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశానికి బోర్డు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వీసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా గత ఏడాది వివిధ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారుల ప్రతిభను అభినందించారు. ఇతర వర్సిటీల్లో క్రీడలకు హాజరయ్యే వారికి డీఏ పెంపు విషయం ఆలోచిస్తామన్నారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని అనుబంధ కళాశాలల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ కాలేజియేట్ పోటీల నిర్వహణకు ఆమోదించారు. ప్రతి కాలేజీలో ఫిజికల్ డైరెక్టర్లను నియమించేలా ఉత్తర్వులు జారీచేస్తామన్నారు. కళాశాలలకు క్రీడా మైదానాలు తప్పనిసరిగా ఉండాలన్నారు.

గత ఏడాది విద్యార్థులు సాధించిన విజయాలను స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ వివరించారు. ఆలిండియా ఇంటర్ వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్‌లో ఎన్.పల్లవి గోల్డ్‌మెడల్, బి.ఝాన్సీ బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. కిక్ బాక్సింగ్‌లో బి.నితిన్ బ్రాంజ్ మెడల్ గెలిచాడన్నారు. ఈ ఏడాది పురుషులు, మహిళల విభాగంలో 94 క్రీడాంశాల్లో పోటీలకు పంపిస్తున్నట్టు తెలిపారు. సౌత్ ఇండియా వర్సిటీ క్రికెట్ పోటీలు ఏయూ వేదికగా నిర్వహించనున్నామన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పల్లవి మాట్లాడుతూ డీఎస్సీలో తమ విభాగ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఒలింపియన్, పోర్టు మాజీ క్రీడాధికారి ఎం.మాణిక్యాలరావులను వీసీ సత్కరించారు. డీన్ ఫ్యాక్టరీ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్‌బీ కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఏఎంఎల్ కళాశాల పీడీ డాక్టర్ నాయుడు, ఏవీఎన్ కళాశాల పీడీ డాక్టర్ గోపీ కృష్ణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

ఓట్ల చోరీపై కాంగ్రెస్ పార్టీ నేతల సంతకాల సేకరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఓట్ల అవకతవకలపై ఏఐసీసీ ఆదేశాల మేరకు నగరంలోని పలు వార్డుల పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సంతకాలను సేకరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వర్మరాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు, నేతలకు సంతకాల సేకరణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం దక్షిణ నియోజకవర్గంలోని జీవీఎంసీ 31వ వార్డు నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మరాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఓట్ల చోరీపై కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు. లక్షలాది మంది ఓటర్ల నుంచి సంతకాలను సేకరించి ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యంపై ప్రజా పోరాటాలను చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు లక్కరాజు రామారావు, కమలాకర్, సూర్యనారాయణ, ఆనంద్‌కుమార్, కస్తూరి వెంకటరావు, బాషా, జగన్, అప్పలనాయుడు, అలీ, రాజేష్, ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



క్రైం... crime news

యువతి ఆత్మహత్య


నిస్సీగ్రేస్ మృతదేహం

మద్దిలపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తున్న ప్రియుడితో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన పాత రేసపువానిపాలెంలో మంగళవారం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సైతరుపేటకు చెందిన కర్రి నిస్సీగ్రేస్ (19) నగరంలో ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు చదువుతోంది. చింతపల్లికి చెందిన రేమాల ఉపేంద్ర, నిస్సీగ్రేస్ ప్రేమించుకున్నారు. ఉపేంద్ర ఏటీఎం మిషన్లలో నగదు పెట్టే ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరూ పాత రేసపువానిపాలెంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో గొడవపడ్డారు. కోపంతో ఉపేంద్ర బయటకు వెళ్లిపోయాడు. ఓ గంట తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి నిస్సీగ్రేస్ చీరతో ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం : ముగ్గురి అరెస్టు

కూర్మన్నపాలెం,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ యువతిని వంచించి, పెళ్లి పేరుతో మోసం చేసి గర్భం స్రావం చేయించిన వ్యక్తిని, సహకరించిన మరో ఇద్దరిని దువ్వాడ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. అగనంపూడి ప్రాంతానికి చెందిన యువతిని పరవాడ మండలం ఇ మర్రిపాలేనికి చెందిన దుల్ల కిశోర్ (21) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని లోబరచుకున్నారు. దీంతో ఆమె గర్భం దాల్చింది. ఈ నెల 16న ఆమెకు బలవంతంగా గర్భస్రావం చేయించాడు. ఇతడికి పరవాడ మండలం వినాయకనగర్‌కు చెందిన గండి సతీష్ (28), గండి వెంకటేష్ (25) సహకరించారు. మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిశోర్‌ను విచారణకు పిలిపించగా సతీష్, వెంకటేష్ మద్యం సేవించి స్టేషన్‌కు వచ్చి బాధిత యువతిని బెదిరించారు. అడ్డుకున్న పోలీసులపై దాడి చేసి, దుర్భాషలాడారు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కొండవాలు ఆక్రమణ వెనుక కూటమి నేత ?

'ఆంధ్రజ్యోతి' కథనంతో ఎక్సకవేటర్‌తో పలాయనం

విశాఖపట్నం/ఆనందపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం భీమన్నదొరపాలెంలో పాత సర్వేనంబరు 156లోని కొండవాలును చదునుచేసి ఆక్రమణలకు పాల్పడడం వెనుక కూటమి పార్టీలో ఓ కీలక నేత ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. గ్రామంలో కూటమి కీలక నేత కుటుంబానికి, మరో వ్యాపారి కుటుంబానికి భారీగా భూములున్నాయి. ఏళ్ల క్రితమే రైతుల నుంచి డీపట్టాలను అనధికారికంగా కొనుగోలుచేసి తోటలు వేశారు. సుమారు 30 నుంచి 40 ఎకరాల్లో ఉన్న తోటలకు ఆనుకుని పాత సర్వేనంబరు 156లో కొండ ఉంది. దీని విస్తీర్ణం 175 ఎకరాలు కాగా మొత్తం ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. అయినా కూటమి పార్టీలో ఉన్నామనే ధీమాతో కొండవాలులో చెట్లు, పొదలు తొలగించారనే ఆరోపణలున్నాయి. అయినా రెవెన్యూ అధికారులు అటువైపు దృష్టి సారించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొండ వాలు ఆక్రమణలపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో ఆక్రమణదారులు అప్రమత్తమయ్యారు. పనులుచేసే చోట నుంచి ఎక్సకవేటర్‌ను తరలించారు. రెవెన్యూలో కిందిస్థాయి ఉద్యోగులు వారిని హెచ్చరించి ఉంటారని చెబుతున్నారు. కాగా ఈ కథనంపై ఆనందపురం తహశీల్దారు శ్రీనుబాబు స్పందించారు. చదునుచేసే పనులు నిలిపివేయాలని గ్రామ రెవెన్యూ అధికారిని ఆదేశించారు. తక్షణమే అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేయాలని, ఆక్రమణలను పాల్పడిన వారి వివరాలు సేకరించాలని స్పష్టంచేశారు. అయితే కొండవాలులో సుమారు 10 ఎకరాల వరకు ఆక్రమణలకు పాల్పగిన వారు కూటమి పార్టీలో ఉన్నందున కలెక్టర్ జోక్యం చేసుకోవాలని గ్రామస్థులు లేదంటే కొండ మొత్తం కబ్జా చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సందడిగా అండర్-17 బాలికల కరాటే ఎంపికలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలికల కరాటే సెలక్షన్ ట్రయల్స్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు ప్రభుత్వం కల్పించే వనరులను సద్వినియోగం చేసుకొని పోటీల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఎంపిక పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 400 మంది బాలికలు పాల్గొన్నారు. వీరిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు.

జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించిన కార్పొరేటర్లు


జైపూర్ నగర నిగమ్ కార్యాలయంలో మేయర్ సోనమ్ గుర్జార్‌తో మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కార్పొరేటర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరభారతదేశంలోని పలు నగరాల అధ్యయన యాత్రకు వెళ్లిన జీవీఎంసీ కార్పొరేటర్లు బుధవారం జైపూర్ నగర నిగమ్ (కార్పొరేషన్) కార్యాలయాన్ని సందర్శించినట్టు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు జైపూర్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వారసత్వ భవనాల సంరక్షణ, ఘన-ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్రజాహితపాలన వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం జైపూర్ నగర నిగమ్ కార్యాలయాన్ని సందర్శించారు. జైపూర్ నగర నిగమ్ మేయర్ సోనమ్‌గుర్జార్, ఇంజనీర్ ఓమన్ కార్గ్ కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. నగర అభివృద్ధితోపాటు సాధించిన ప్రగతిని పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మేయర్ పీలా జీవీఎంసీ సాధించిన అవార్డులు, నగర సుందరీకరణ, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వివరాలను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఐఐఎం, ఐఐఐటీ మణిపూర్ మధ్య అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలతో ఐఐఎం, ఐఐఐటీ డైరెక్టర్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విశాఖపట్నం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) సేనాపతి మణిపూర్ మధ్య బుధవారం ఓ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. కేంద్ర నిధులతో నడిచే సాంకేతిక సంస్థలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థల (పీజీపీఎంసీఐ)కు పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నాయి. ఐఐఎంవీ క్యాంపస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, ఐఐఐటీ సేనాపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణన్‌భాస్కర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంవోయూ ద్వారా మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రోగ్రామ్ చైర్ ప్రొఫెసర్ ఎం.షమీమ్ జావెద్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు 75 శాతం జీతం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు 75 శాతం జీతాన్ని యాజమాన్యం బుధవారం చెల్లించింది. జీతాల కోసం ఉక్కు యాజమాన్యంపై కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి దర్నాలు చేశారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలకు సంబంధించి 75 శాతం జీతాన్ని బుధవారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాలో జమచేశారు. గత ఏడాది సెప్టెంబరు లో 50, అక్టోబరులో 35, నవంబరులో 35, డిసెంబరులో 35, ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల వరకు 25 శాతం చొప్పున జీతాల్లో యాజమాన్యం కోత విధించింది. దీంతో ఉద్యోగులకు మొత్తం 355 శాతం జీతం పెండింగ్‌లో ఉంది.

విమానాశ్రయంలో ఘనంగా యాత్రి సేవా దివస్


వివిధ పోటీల విజేతలతో విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తమ్

గోపాలపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నం విమానాశ్రయంలో యాత్రి సేవా దివస్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. డొమస్టిక్ ఎరైవల్ ప్రాంతంలో విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.పురుషోత్తమ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆగమన, నిష్క్రమణ ప్రాంతాల్లో ప్రజా నృత్య ప్రదర్శన, ఏక్ పేడ్ మాకే నామ్, రక్తదాన శిబిరం, ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.